
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

విజయనగరం
జిల్లా వార్తలు
శనివారం 8 జూన్ 2024







మంత్రి పదవులు దక్కే దెవరికో?

- రేస్‌లో కళా వెంకటరావు, కోండ్రు మురళి
- మహిళా కోటా నుంచి ఆశిస్తున్న కోళ్ల, అదితి

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

ఈ ఎన్నికల్లో జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. ఇప్పుడు అందరి చూపు మంత్రివర్గ కూర్పుపైనే పడింది. ఎవరికి మంత్రి పదవులు వరించ బోతున్నాయి, ఆ అదృష్టవంతులు ఎవరన్నది జిల్లా వ్యాప్తంగా చర్చ సాగుతోంది. 2014లో ఏర్పాటైన టీడీపీ ప్రభుత్వంలో జిల్లాకు ఒక్కమంత్రి పదవి మాత్రమే వరించింది. చీపురుపల్లి నుంచి గెలుపొందిన కిమిడి మృణాళినికి మంత్రి పదవిని చంద్రబాబు కట్టబెట్టారు. ఆమె గృహనిర్మాణ శాఖ మంత్రిగా పని చేశారు. తరువాత జరిగిన మంత్రివర్గ విస్తరణలో మృణాళినిని మంత్రి పదవి నుంచి తొలగించారు. బొబ్బిలి ఎమ్మెల్యేగా వైసీపీ నుంచి గెలుపొంది టీడీపీలో చేరిన సుజయ్ కృష్ణరంగారావుకు మంత్రి పదవి కట్టబెట్టారు. భూగర్భ గనుల శాఖ మంత్రిగా ఆయన పనిచేశారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైంది. వైసీపీలో జిల్లాకు రెండు మంత్రి పదవులు ఇచ్చారు. చీపురుపల్లి నుంచి గెలుపొందిన బొత్స సత్యనారాయణ, కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి మంత్రి పదవులు దక్కాయి. మంత్రి వర్గ విస్తరణలో పుష్పశ్రీవాణి మంత్రి పదవిని కోల్పోయారు. ఈ పదవిని సాలూరు ఎమ్మెల్యే పీడిక రాజన్నదొరకు దక్కింది. ఇలా గతంలో టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు మంత్రి పదవులను అందించారు. అయితే తాజాగా జిల్లా విభజన జరిగింది. దీనికి తోడు జిల్లాలో అంతా సీనియర్ నాయకులు, మాజీ మంత్రులుగా పనిచేసిన వారు ఎక్కువయ్యారు. ఈ ఎన్నికల్లో చీపురుపల్లి నుంచి గెలుపొందిన కిమిడి కళావెంకట్రావు అనేక పర్యాయాలు మాజీ మంత్రిగా, పొలిట్ బ్యూరో సభ్యునిగా ఉన్నారు. మంత్రి బొత్సపై గెలుపొందిన కళావెంకట్రావు మంత్రి పదవిని ఆశిస్తున్నారు. అలాగే జిల్లాలో కొత్తగా రాజాం నియోజకవర్గం కలిసింది. రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన కోండ్రు మురళీమోహన్ కూడా గతంలో మంత్రిగా పనిచేశారు. ఎస్సీ కేటగిరీలో అయినా ఈసారి తనకు మంత్రి పదవి దక్కుతుందని ఆయన భావిస్తున్నారు. ఎస్.కోట ఎమ్మెల్యేగా గెలుపొందిన కోళ్ల లలితకుమారి కూడా సీనియర్ నాయకురాలిగా ఉన్నారు. మూడుసార్లు ఎస్.కోట నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. జిల్లా టీడీపీ అధ్యక్షురాలిగా పనిచేశారు. పార్టీ పట్ల విధేయత, పార్టీకి కట్టుబడి ఉన్న నాయకురాలిగా గుర్తింపు ఉంది. ఈ నియోజకవర్గం నుంచే టంగుటూరి ప్రకాశం పంతులు ఎమ్మెల్యేగా గెలుపొంది ముఖ్య మంత్రిగా పనిచేశారు. ఇటువంటి నియోజకవర్గానికి తరువాత కాలంలో మంత్రి పదవులు వరించలేదు. ఇప్పుడు కోళ్ల మంత్రి పదవి ఆశిస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేసిన పొలిట్ బ్యూరో సభ్యుడు పూసపాటి అశోక్ గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు జిల్లాలోనే భారీ ఆధిక్యంతో గెలుపొందారు. అశోక్‌ను సంప్రదించకుండా చంద్రబాబు జిల్లాకు సంబంధించి మంత్రి పదవుల కూర్పు చేయరు. ఈ పరిస్థితిలో తన కుమార్తెకు మంత్రి పదవి ఇవ్వాలని కోరితే మరింత పోటీ నెలకోనుంది. అయితే, ప్రస్తుత పరిస్థితిలో అశోక్ ఏ విధంగా వ్యవహరిస్తారు అన్నది చూడాలి.

ఉమ్మడి జిల్లాలో మహిళా ఎమ్మెల్యేలే అధికం

- తొమ్మిది మందిలో ఐదుగురు వారే..
- మహామహులను ఓడించి.. విజేతలుగా నిలిచి..

(విజయనగరం/సాలూరు రూరల్)

ఉమ్మడి విజయనగరం జిల్లాలో మహిళా ఎమ్మెల్యేలే అధికంగా ఉన్నారు. సాలూరు, పార్వతీపురం, కురుపాం, బొబ్బిలి, గజపతినగరం, విజయనగరం, శృంగవరపుకోట, నెల్లిమర్ల, చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఐదుగురు మహిళా ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు. సాలూరు నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన గుమ్మిడి సంధ్యారాణి వైసీపీ అభ్యర్థి, ఉపముఖ్యమంత్రి రాజన్న దొరను ఓడించి అత్యధిక మెజార్టీతో విజయం సాధించారు. అదేవిధంగా కురుపాం టీడీపీ అభ్యర్థి తోయక జగదీశ్వరి కూడా తొలి ప్రయత్నంలోనే ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణిని ఓడించి.. విజేతగా నిలిచారు. ఇక విజయనగరం నుంచి అదితి విజ యలక్ష్మి గజపతిరాజు.. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ , వైసీపీ అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామిపై విజయం సాధించారు. ఎస్.కోట నుంచి కోళ్ల లలిత కుమారి ఎమ్మెల్యేగా ఎన్నికై.. వైసీపీ అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావును ఓడించారు. నెల్లిమర్ల నుంచి జనసేన అభ్యర్థి లోకం నాగ మాధవి .. వైసీపీ అభ్యర్థి బడ్డుకొండపై అప్పలనాయుడుపై విజయం సాధించారు. కాగా బొబ్బిలి, గజపతినగరం, పార్వతీపురం, చీపురుపల్లి నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన బేబీ నాయన, కొండపల్లి శ్రీనివాస్, బోనెల విజయచంద్ర, కిమిడి కళావెంకట్రావులు ఎన్నికయ్యారు. వారిలో కళా వెంకట్రావు, కోళ్ల లలితకుమారి మినహాయిస్తే మిలిగిన ఎమ్మెల్యేలు శాసనసభలో తొలిసారి అడుగుపెడుతున్నవారే కావడం విశేషం.

జిల్లా విభజనకు ముందు..

జిల్లా విభజనకు ముందు విజయనగరంలో కలిసి ఉన్న పార్వతీపురం మన్యం జిల్లాకు టీడీపీ హయాంలో మంత్రి పదవులు దక్కలేదు. 1985లో సాలూరు ఎమ్మెల్యే బోయిన రాజయ్య ఎన్టీఆర్ మంత్రి వర్గంలో కొద్ది నెలలే పనిచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అనేక మంది ఈ రెవెన్యూ డివిజన్ నుంచి మంత్రులుగా ఎన్నికయ్యారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పుష్పశ్రీవాణి, రాజన్నదొర (సాలూరు) మంత్రులుగా పనిచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో శత్రుచర్ల విజయరామరాజు రెండు పర్యాయాలు అటవీ శాఖ మంత్రిగా పనిచేశారు. ఈ ఎన్నికల్లో టీడీపీ నుంచి సాలూరు ఎమ్మెల్యేగా పోటీ చేసి డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొరపై ఘన విజయం సాధించిన గుమ్మిడి సంధ్యారాణికి మంత్రి పదవి దక్కే అవకాశం ఉందన్న వాదన విన్పిస్తోంది. ఆమె అరకు పార్లమెంట్ జిల్లా అధ్యక్షురాలిగా, పొలిట్ బ్యూరో సభ్యురాలిగా, మాజీ ఎమ్మెల్సీగా, సీనియర్ నాయకురాలిగా గుర్తింపు ఉంది. మన్యం జిల్లాలో కురుపాం తోయిక జగదీశ్వరి, పార్వతీపురం బోనెల విజయచంద్ర, పాలకొండ నిమ్మక జయకృష్ణ (జనసేన) గెలుపొందారు. వీరిలో ఎవరికైనా అనుహ్యంగా మంత్రి పదవులు వరిస్తాయో ఏమో చూడాలి.



ఒక్క జీడి పంటకే బీమా!

- మామిడి పంట విస్తీర్ణం ఎక్కువగా ఉన్నా వర్తింపజేయని అధికారులు
- మిగిలిన ఉద్యాన పంటలకు ఎత్తివేత
- గగ్గోలు పెడుతున్న రైతులు

బొబ్బిలి, జూన్ 7: జిల్లాలో ఒక్క జీడి పంటకు తప్ప ఇతర ఉద్యాన పంటలకు బీమా వర్తించకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్నిరకాల ఉద్యాన పంటల విస్తీర్ణం 45,750 హెక్టార్లు. ఇందులో మామిడి 30,714 హెక్టార్లు, జీడి 6,500, అరటి 1,600, ఆయిల్‌పామ్ 1,638, కొబ్బరి 3,500, జామ 150 హెక్టార్లలో సాగవుతున్నాయి. కొత్తగా వచ్చిన నిబంధనల ప్రకారం 25 శాతానికి మించి సాగు విస్తీర్ణం ఉన్న పంటలకే బీమా వర్తింపజేస్తున్నారు. తక్కువ విస్తీర్ణం ఉన్న పంటలకు వర్తింపజేయడం లేదు. అయితే, ఒక్కో జిల్లాలో ఒక్కో పంటకు బీమాను చెల్లిస్తుండడం విమర్శలకు తావిస్తుంది. విజయనగరం జిల్లాలో మామిడి పంట అధిక విస్తీర్ణంలో సాగవుతున్నా బీమాను అందించడం లేదు. కేవలం జీడి పంటకే బీమా చెల్లిస్తున్నారు. దీంతో రైతాంగం లబోదిబోమంటోంది. గడిచిన నాలుగైదేళ్ల నుంచి ప్రకృతి అనుకూలించకపోవడంతో మామిడి రైతులు పూర్తిగా కుదేలవుతున్నారు. ఆయిల్ పామ్ సాగు మోజుతో పలువురు రైతులు మామిడి తోటలను తొలగిస్తున్నారు. బొబ్బిలి ప్రాం తం ఒకప్పుడు మామిడి సాగులో ముందుండేది. నాణ్యమైన ఎగుమతి రకాల మామిడి పండ్లను పండించడంలో మంచి గుర్తింపు ఉండేది. మామిడి పండ్ల ప్రదర్శనలో అనేక బహుమతులను కైవసం చేసుకున్న దాఖలాలు ఉన్నాయి. ఇప్పుడు ఆ వైభవమంతా కనుమరుగై చరిత్రగానే మిగిలిపోయిందని మామిడి రైతులంతా తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. విజయనగరం జిల్లాలో మామిడి పంటకు బీమాను వర్తింపజేయాలని గత జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి ప్రత్యేక నివేదిక పంపారు. ప్రజాప్రతినిధులు, మామిడి రైతుల వినతుల మేరకు కలెక్టరు ప్రతిపాదనలు పంపినప్పటికీ వైసీపీ ప్రభుత్వం నుంచి ఎటువంటి సానుకూల నిర్ణయం వెలువడలేదు.

అధికారులు పట్టించు కోవడం లేదు..

ఐదేళ్లుగా మామిడి రైతులకు దెబ్బమీద దెబ్బ తగులుతూనే ఉంది. బీమా సంగతి పూర్తిగా మరిచిపోయాం. కొన్ని జిల్లాలకు మాత్రమే బీమాను వర్తింపజేస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో జిల్లా మామిడికి ముఖ్యంగా బొబ్బిలి మామిడికి ఎంతో ప్రత్యేక స్థానం ఉండేది. ఉద్యానశాఖతో రైతులకు పూర్తిగా సంబంధాలు తెగిపోయాయి. మామిడి దిగుబడికి గతంలో అధికారులు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేవారు. ఇప్పుడు కనీసం సమాచారం అందించడం లేదు. 50 ఏళ్ల వయస్సు దాటిన మామిడి చెట్లను కాపాడుకునేందుకు ప్రతీ రైతుకు ఏటా వంద రూపాయల సాయాన్ని ప్రభుత్వం అందజేయాలి. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలి. మామిడికి బీమాను కచ్చితంగా వర్తింపజేయాలి.

-సాలా వెంకట మురళీకృష్ణారావు, అభ్యుదయ రైతు, బొబ్బిలి

25 శాతం విస్తీర్ణం ఉంటేనే..

రాష్ట్రంలో ఒక్కో జిల్లాలో ఒక్కో రకమైన ఉద్యాన పంటకు బీమాను వర్తింపజేస్తున్నారు. విజయనగరం జిల్లాలో జీడి పంటకు మాత్రమే వాతావరణ ఆధారిత బీమాను సంక్లిష్ట పరిస్థితుల్లో వర్తింపజేస్తారు. జిల్లాలో అరటి 1,600 హెక్టార్లలో మాత్రమే సాగవుతోంది. వాస్తవానికి 25 శాతం మేర పంట విస్తీర్ణం ఉంటేనే బీమాను వర్తింపజేస్తారు.

-వెంకటరత్నం, ఉద్యానవనశాఖాధికారి

ఏమిటీ మతలబు?

- సచివాలయ ఏఎన్‌ఎంల పదోన్నతులకు ఉత్తర్వులు జారీ చేసిన వైద్య ఆరోగ్య శాఖ
- ఈనెల 10న తుదిజాబితా అందించాలని ఆదేశాలు
- అర్హత, ఖాళీలను బయటపెట్టని వైనం
- కొత్త ప్రభుత్వం ఏర్పడక ముందే ఉత్తర్వులు ఇవ్వడంపై సందేహాలు



శృంగవరపుకోట, జూన్ 7

గ్రామ, వార్డు సచివాలయాల్లో (గ్రేడ్-3) ఏఎన్‌ఎంలుగా పని చేస్తున్న వారిలో అర్హులైన వారందరికీ పదోన్నతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేయడంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సీనియార్టీ జాబితాలో ఉన్న అభ్యంతరాలను సరిచేసి తుది జాబితాను ఈనెల 10న వెల్లడించాలని గడువు విధించింది. 11న కౌన్సిలింగ్, 12న పదోన్నతి ఆర్డర్, 13న జిల్లా వెబ్‌సెట్, కమిషనర్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ వెబ్‌సెట్‌లో పదోన్నతి పొందినవారి వివరాలను డిస్‌ప్లే చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే, కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాకముందే వైద్య ఆరోగ్య శాఖ తీసుకున్న ఈ నిర్ణయంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో 500మందికి పైబడి గ్రేడ్-3 ఏఎన్‌ఎంలు ఉన్నారు. వీరి పదోన్నతి కోసం జీవో జారీ చేసిన అధికారులు సీనియార్టీ జాబితాను తయారు చేసేందుకు అమలు చేస్తున్న నిబంధనలను మాత్రం బయటపెట్టడం లేదు. గ్రామ, వార్డు సచివాలయ పరీక్షల్లో వచ్చిన మార్కులను బట్టి సీనియార్టీ జాబితా ఉంటుందని మాత్రమే చెబుతున్నారు. పదోన్నతుల ఖాళీలు ఎన్ని ఉన్నాయో కూడా బహిర్గతం చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది.

ఉత్తర్వులు అమలయ్యేనా?

వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఏఎన్‌ఎంలు, సచివాలయాల్లో పని చేస్తున్న గ్రేడ్-3 ఏఎన్‌ఎంల విధుల నిర్వహణ ఒకేలా ఉంటుంది. గ్రేడ్-3 ఏఎన్‌ఎంలకు పంచాయతీ రాజ్‌శాఖ కూడా అదనంగా పని చెబుతుంది. వీరి జీతభత్యాలను పెట్టే డీడీవో అధికారం పంచాయతీ కార్యదర్శులకు అప్పగించడంతో పంచాయతీలోని ఇతర పనులను అప్పగిస్తున్నారు. ఇంతగా పని ఒత్తిడి ఉన్నా గ్రేడ్-3 ఏఎన్‌ఎంలకు, వైద్య ఆరోగ్య శాఖ ఏఎన్‌ఎంలకు మధ్య రూ.10వేలకు పైబడి జీతభత్యాల్లో తేడా ఉంది. గ్రేడ్-3 ఏఎన్‌ఎంలకు తక్కువ వేతనం ఇస్తుండడంతో కనీసం పదోన్నతి వచ్చిన జీతం పెరుగుతుందన్న ఆశతో ఉన్నారు. గ్రామ, వార్డు సచివాలయ పరీక్ష రాసిన వీరంతా ఒకే రోజున జాయిన్ అయ్యారు. వీరిలో చాలా మంది కాంట్రాక్టు-2 ఏఎన్‌ఎంలుగా 12 ఏళ్ల పాటు పని చేసిన వారే. ఈ పని కాలాన్ని సర్వీస్‌లో చూపాలని వైసీపీ ప్రభుత్వాన్ని వేడుకున్నా పట్టించుకోలేదు. పదోన్నతుల ఖాళీలు ఎన్ని ఉన్నాయి? ఏ ప్రాతిపాదికన పదోన్నతి కల్పిస్తారు? తమకు అవకాశం వ స్తుందా? రాదా అన్న మీ మాంసలో కొట్టుమిట్టాడుతున్నారు. అయితే, ప్రభుత్వం మారుతున్న తరుణంలో ఈ ఉత్తర్వులు అమవుతాయా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ఎల్.కోట ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న రాష్ట్ర జాయింట్ డైరక్టర్

క్షయ రహిత సమాజమే లక్ష్యం

- బీసీజీ టీకాలను శతశాతం పూర్తి చేయాలి
- రాష్ట్ర క్షయవ్యాధి నివారణ జాయింట్ డైరక్టర్

కొత్తవలస/లక్కవరపుకోట, జూన్ 7: వచ్చే ఏడాది నాటికి క్షయ రహిత సమాజమే లక్ష్యంగా ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర క్షయ వ్యాధి నివారణ జాయింట్ డైరక్టర్ టి.రమేష్ తెలిపారు. శుక్రవారం కొత్త వలస, ఎల్.కోట పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షయవ్యాధి ని వారణకు సంబంధించి వయోజనులకు వేసే బీసీజీ టీకాలను శతశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంతవరకు ఎన్ని టీకాలు వేశారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. టీకాలను వేయించుకునేందుకు వయో జనులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చేవిధంగా అవగాహన కల్పించాలని సూచించారు. బీసీజీ టీకా వేసుకోవడం వలన ఎటువంటి దుష్పరిణామా లు రావన్నారు. గ్రామాల్లోని విద్యావంతులు, గ్రామ పెద్దలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు వైద్య సిబ్బందికి సహకరించాలన్నారు. అన్ని పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో ఈ కార్యక్రమం ముమ్మరంగా జరుగుతుందన్నారు. టీకాలు వేసే సమయంలో దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎల్.కోట మండలంలో 28 మంది క్షయవ్యాధి గ్రస్థులు ఉన్నారని వైద్యాధికారి అనిల్‌కు మార్ తెలిపారు. ఇప్పటివరకు 1,459 మంది వయోజనులకు టీకాలు వేసినట్లు చెప్పారు. 2025 నాటికి రాష్ట్రాన్ని క్షయ రహితంగా మార్చాలని జాయింట్ డైరక్టర్ రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌ఏటీవో కె.రాణి, కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారులు సీతల్ వర్మ, సీతామలక్ష్మీ, సిబ్బంది కృప, రమణమ్మ, శ్రీ నివాస్, సూరిదేముడు, జేవీ ప్రసాదరావు తదుతరులు పాల్గొన్నారు.

రక్షణ తాడే.. ఉరి తాడై


- క్వారీపై నుంచి జారిపడిన కార్మికుడు
- చేతిలో ఉన్న తాడు మెడకు చిక్కుకున్నవైనం
- ఊపిరాడక మృతి.. ధర్మవరంలో విషాదం



అప్పారావు (ఫైల్)



రోదిస్తున్న తల్లి



క్వారీ మధ్యలో వేలాడుతున్న మృతదేహం

శృంగవరపుకోట రూరల్, జూన్ 7: పనిలో రక్షణ కోసం ఉపయోగించే తాడు (సేఫ్టీ రూప్) ఆ కార్మికుడి పాలిట ఉరి తాడు అయింది. ప్రమాదవశాత్తు క్వారీపై నుంచి జారిపడిన ఆ కార్మికుడి మెడకు తాడు బిగుసుకుపోవడంతో ఊపిరాడక మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ధర్మవరం గ్రామంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన లోతేటి అప్పారావు (45) క్వారీ కార్మికుడు. గ్రామ సమీపంలో ఉన్న మల్లేశ్వరమెట్ట (దెయ్యాలమెట్ట)పై రాళ్లు కొట్టి వాటిని ఇళ్ల నిర్మాణాలకు విక్రయిస్తూ జీవిస్తున్నాడు. అప్పారావుతో పాటు మరో 21 మంది కలిసి పనిచేస్తారు. శుక్రవారం ఉదయం ఐదు గంటలకు అప్పారావు రాయి కొట్టేందుకు వంద అడుగుల ఎత్తులో ఉన్న క్వారీపైకి వెళ్లాడు. రక్షణ కోసం నడుముకు పెద్ద తాడు కట్టుకున్నాడు. అలాగే, సురక్షితంగా కిందకు దిగేందుకు చేతితో మరో తాడు పట్టుకు న్నాడు. ఆరు గంటల సమయంలో రాయి కొడుతుండగా కాలు జారింది. అయితే, రక్షణ తాళ్లు ఉండడంతో పైనుంచి కిందకు పడకుండా మధ్యలో వేలాడుతూ ఉండిపోయాడు. ఈ క్రమంలో నడుము తాడును మరింతగా బిగించుకొని చేతిలో ఉన్న తాడుతో కిందకు దిగేందుకు ప్రయత్నం చేసే క్రమంలో ఆ తాడు మెడకు చిక్కుకుంది. దీంతో ఊపిరాడక ప్రాణాలు వదిలాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనునిత్యం కుటుంబం కోసమే తపన..

అప్పారావుకు తల్లి ముత్యాలమ్మ, భార్య పద్మ, కుమారుడు నాయుడు, కుమార్తె ఉన్నారు. అప్పారావు అనునిత్యం తన కుటుంబం కోసం తపన పడేవాడు. ప్రతిరోజూ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు క్వారీ పనికి వెళ్లేవాడు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు అద్దె ఆటో నడిపేవాడు. ఆటో లేని సమయంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా వెళ్లేవాడు. అలా రూపాయి, రూపాయి దాచి ఇంటి అవసరాలను తీర్చ డంతో పాటు గత ఏడా ది క్రితం కుమార్తె వివాహం చేశాడు. అలాగే, రోడ్డు ప్రమాదంలో గాయపడిన కుమారుడికి పెద్ద ఆపరేషన్ చేయించాడు. గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న తల్లికి నెలనెలా మందులు కొనుగోలు చేస్తూ చక్కగా చూసుకుంటున్నాడు. ఇంతలా కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న వ్యక్తి చనిపోవడంతో వారంతా కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అప్పారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లడనికి డబ్బులు లేక అల్లాలాడుతుంటే గ్రామ ఆటోయూనియన్ రూ.5వేలు ఆర్థిక సాయం చేసింది. సర్పంచ్ సన్యాసయ్య, గ్రామ పెద్దలు లగుడు తిరుపతి, అల్లు మహాలక్ష్మి నాయుడు, తదితరులు బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. అప్పారావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

విద్యుత్ స్తంభాన్ని ఎత్తుతుండగా..

- తీగలను తాకిన నిచ్చెన
- షాక్‌కు గురై ఒకరి మృతి.. మరొకరికి గాయాలు
- మృతుడిది శ్రీకాకుళం జిల్లా



గాయపడిన కృష్ణ



శ్రీనివాసరావు మృతదేహం

రేగిడి, జూన్ 7: కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసే క్రమంలో ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం రేగిడి మండల కాంప్లక్స్ సమీపంలో చోటు చేసుకుంది. విద్యుత్ సిబ్బంది, స్థానికుల వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం పంతులపేట గ్రామానికి చెందిన బొండాది శ్రీనివాసరావు (50), లబ్బ కృష్ణతో పాటు మరో 8 మంది ఉంగరాడమెట్ట సబ్‌స్టేషన్‌కు సంబంధించి విద్యుత్‌లైన్ పునరుద్ధరణ, కొత్త స్తంభాల ఏర్పాటు పనుల కోసం వచ్చారు. శుక్రవారం సాయంత్రం మండల కాంప్లెక్స్ సమీపంలో స్తంభాన్ని ఎత్తేసమయంలో భారీగా గాలివీచింది. దీంతో శ్రీనివాసరావు చేతిలో ఉన్న నిచ్చెన సమీపంలో ఉన్న 11 కేవీ విద్యుత్‌లైన్‌కు తగిలినట్లు స్థానిక ఇన్‌చార్జి ఏఈ ఎల్.హరిబాబు తెలిపారు. దీంతో విద్యుత్ షాక్‌కు గురై శ్రీనివాసరావు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. కృష్ణ కాళ్ల భాగంలో తీవ్రగాయాలయ్యాయి. వీరిని సమీపంలో ఉన్న రేగిడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించగా, అప్పటికే శ్రీనివాసరావు చనిపోయినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. గాయపడిన కృష్ణకు ప్రాథమిక చికిత్స అందించారు. శ్రీనివాసరావుకు భార్య గోవిందమ్మ, పిల్లలు హేమంత్, నవీన్ ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

దిక్సూచి
DIKSUCHI


సిడాక్‌లో పీజీ డిప్లొమాలు

పుణెలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్(సిడాక్)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా(పీజీ డిప్లొమా) ఆగస్టు సెషన్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇవి 24 వారాల వ్యవధి గల ఫుల్ టైం ప్రోగ్రామ్‌లు. సంస్థ నిర్దేశించిన మేరకు కోర్సులను ఆన్‌లైన్/ ఫిజికల్ మోడ్‌లో నిర్వహిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా థియరీ సెషన్స్, ల్యాబ్ సెషన్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. వీటిని సి-డాక్, ఐసీటీ సంస్థలకు చెందిన నిపుణులు నిర్వహిస్తారు. ఆప్టిట్యూడ్, కమ్యూనికేషన్ అండ్ ఇంటర్వ్యూ స్కిల్స్ అంశాలపై ప్రత్యేక శిక్షణ ఉంటుంది. సంస్థ నిర్వహించే కామన్ అడ్మిషన్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ సౌకర్యం ఉంది. హైదరాబాద్ సెంటర్లో మహిళలకు మాత్రమే హాస్టల్ అందుబాటులో ఉంది.

కోర్సులు

- పీజీ డిప్లొమా ఇన్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (పీజీ-డీఏసీ)
- పీజీ డిప్లొమా ఇన్ బిగ్ డేటా అనలిటిక్స్(పీజీ-డీబీడీఏ)
- పీజీ డిప్లొమా ఇన్ ఎంబెడెడ్ సిస్టమ్స్ డిజైన్ (పీజీ-డీఈఎస్‌డీ)
- పీజీ డిప్లొమా ఇన్ ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సిస్టమ్స్ అండ్ సెక్యూరిటీ(పీజీ-డీఐటీఐఎస్ఎస్)
- పీజీ డిప్లొమా ఇన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (పీజీ-డీఏఐ)
- పీజీ డిప్లొమా ఇన్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(పీజీ-డీఐఓటీ)
- పీజీ డిప్లొమా ఇన్ వీఎల్ఎస్ఐ డిజైన్(పీజీ-డీవీఎల్ఎస్ఐ)
- పీజీ డిప్లొమా ఇన్ మొబైల్ కంప్యూటింగ్(పీజీ-డీఎంసీ)
- పీజీ డిప్లొమా ఇన్ అడ్వాన్స్‌డ్ సెక్యూర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్(పీజీ-డీఏఎస్ఎస్‌డీ)
- పీజీ డిప్లొమా ఇన్ రోబోటిక్స్ అండ్ అలైడ్ టెక్నాలజీస్(పీజీ-డీఆర్ఏటీ)
- పీజీ డిప్లొమా ఇన్ హెచ్‌పీసీ సిస్టం అడ్మినిస్ట్రేషన్(పీజీ-డీహెచ్‌పీసీఎస్ఏ)
- పీజీ డిప్లొమా ఇన్ ఫిన్‌టెక్ అండ్ బ్లాక్ చెయిన్ డెవలప్‌మెంట్(పీజీ-డీఎఫ్‌బీడీ)
- పీజీ డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఫోరెన్సిక్స్(పీజీ-డీసీఎస్ఎఫ్)
- పీజీ డిప్లొమా ఇన్ అన్‌మాన్‌డ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్ ప్రోగ్రామింగ్(పీజీ-డీయూఏఎస్‌పీ)

ట్రెయినింగ్ సెంటర్లు: హైదరాబాద్, బెంగళూరు, భువనేశ్వర్, చెన్నై, ఇండోర్, గువహటి, జైపూర్, కరాడ్, కొచ్చి, కోల్‌కతా, ముంబై, నవీ ముంబై, నాగ్‌పూర్, నాసిక్, న్యూఢిల్లీ, నోయిడా, పట్నా, పుణె, సిల్చార్, తిరువనంతపురం.



సీట్ల వివరాలు: హైదరాబాద్ సెంటర్లో మొత్తం 540 సీట్లు ఉన్నాయి. అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ 140, బిగ్ డేటా అనలిటిక్స్‌లో 60, ఎంబెడెడ్ సిస్టమ్స్ డిజైన్ 120, ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సిస్టమ్స్ అండ్ సెక్యూరిటీ 40, వీఎల్ఎస్ఐ డిజైన్ 40, అడ్వాన్స్‌డ్ సెక్యూర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ 80 సీట్లు, అన్‌మాన్‌డ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్ ప్రోగ్రామింగ్ 60 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సులను ఫిజికల్ మోడ్‌లో నిర్వహిస్తారు.

- ఇతర సెంటర్లలోని కోర్సులు, సీట్ల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

హైదరాబాద్ సెంటర్ కోర్సుల అర్హత వివరాలు: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఐటీ/కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్/టెలి కమ్యూనికేషన్స్/ఎలక్ట్రికల్/ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు; కంప్యూటర్ సైన్స్/ఐటీ/ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో ఎమ్మెస్సీ/ఎంఎస్ పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అడ్వాన్స్‌డ్ సెక్యూర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెం ట్ కోర్సుకు ఎంసీఏ ఉత్తీర్ణులు; అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్, బిగ్ డేటా అనలిటిక్స్ కోర్సులకు ఏదేని ఇంజనీరింగ్ డిగ్రీ/ఎంసీఏ/ఎంసీఎం/ డిగ్రీ(ఐటీ/కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్)/పీజీ (ఫిజిక్స్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్/మేనేజ్‌మెంట్) పూర్తిచేసినవారు; ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సిస్టమ్స్ అండ్ సెక్యూరిటీ కోర్సుకు పీజీ(మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్)/ఎంసీఏ ఉత్తీర్ణులు; అన్‌మాన్‌డ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్ ప్రోగ్రామింగ్‌కు ఏదేని ఇంజనీరింగ్ డిగ్రీ/ఎంసీఏ/ఎంసీఎం/పీజీ డిగ్రీ(ఫిజిక్స్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్) / డిగ్రీ(ఐటీ/కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్)తోపాటు పీజీ(మేనేజ్‌మెంట్) పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీ/పీజీ స్థాయిలో కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ కోర్సుకు మాత్రం 50 శాతం మార్కులు చాలు.

సిడాక్ కామన్ అడ్మిషన్ టెస్ట్ వివరాలు: ఇందులో ఎ, బి, సి అనే మూడు సెక్షన్‌లు ఉంటాయి. ఒక్కో సెక్షన్‌కు పరీక్ష సమయం గంట. ప్రతి సెక్షన్‌లో 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నలన్నీ ఆంగ్ల మాధ్యమంలో ఉంటాయి. 'ఎ' సెక్షన్‌లో ఇంగ్లీష్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్, కంప్యూటర్ ఫండమెంటల్స్-ప్రోగ్రామింగ్ అంశాల నుంచి; 'బి' సెక్షన్‌లో సీ-ప్రోగ్రామింగ్, డేటా స్ట్రక్చర్స్, ఆబ్జెక్ట్ ఓరియంటెడ్ ప్రోగ్రామింగ్ కాన్సెప్ట్స్, ఆపరేటింగ్ సిస్టమ్స్, నెట్‌వర్కింగ్, బిగ్ డేటా & ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అంశాల నుంచి; 'సి' సెక్షన్‌లో కంప్యూటర్ ఆర్కిటెక్చర్, డిజిటల్ ఎలక్ట్రానిక్స్, మైక్రో ప్రాసెసర్స్ అంశాలనుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు 3 మార్కులు నిర్దేశించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. ఎంబెడెడ్ సిస్టమ్స్ డిజైన్, వీఎల్ఎస్ఐ డిజైన్ కోర్సులకు అన్ని సెక్షన్‌ల పేపర్లు; మిగిలిన కోర్సులకు 'ఎ', 'బి' సెక్షన్‌ల పేపర్లు రాయాల్సి ఉంటుంది.

- **దరఖాస్తు ఫీజు:** 'ఎ' సెక్షన్ + 'బి' సెక్షన్ పేపర్లకు రూ.1550; 'ఎ' సెక్షన్ + 'బి' సెక్షన్ + 'సి' సెక్షన్ పేపర్లకు రూ.1750
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 26
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** జూలై 2 నుంచి 6 వరకు
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ
- **సిడాక్ కామన్ అడ్మిషన్ టెస్ట్ తేదీలు:** జూలై 6, 7
- **పీజీ డిప్లొమా కోర్సులు ప్రారంభం:** ఆగస్టు 29 నుంచి
- **వెబ్‌సైట్:** www.cdac.in

బాసర ఆర్‌జీయూకేటీలో ఇంటిగ్రేటెడ్ బీటెక్

నిర్మల్ జిల్లా బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్‌జీయూకేటీ)- ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ విద్యార్థుల కోసం 85 శాతం సీట్లు ప్రత్యేకించారు. మిగిలిన సీట్లకు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు పోటీపడవచ్చు. ఇతర రాష్ట్రాల విద్యార్థుల కోసం గ్లోబల్ కేటగిరీ కింద అదనంగా అయిదు శాతం సూపర్ న్యూమరీ సీట్లు; విదేశీ విద్యార్థుల కోసం రెండు శాతం సూపర్ న్యూమరీ సీట్లు నిర్దేశించారు. పదోతరగతిలో సాధించిన మెరిట్ గ్రేడ్ పాయింట్ యావరేజ్ (జీపీఏ), రిజర్వేషన్ నిబంధనలు, కౌన్సెలింగ్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు. జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలలు సహా నాన్ రెసిడెన్షియల్ గవర్నమెంట్ స్కూళ్లలో చదివిన విద్యార్థులకు నిబంధనల ప్రకారం వెయిటేజీ ఇస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు: మొదటి రెండేళ్లు ప్రీ యూనివర్సిటీ కోర్సు ఉంటుంది. ఇందులో మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, లైఫ్ సైన్సెస్, హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సబ్జెక్టులు ఉంటాయి. తరవాత నాలుగేళ్లపాటు బీటెక్ కోర్సు ఉంటుంది. ఇందులో కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాల్లో ఒకదాన్ని ఎంచుకోవాలి. మైనర్ సబ్జెక్టు కింద బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్ మేథమెటిక్స్, సోషల్ సైన్సెస్, స్టాటిస్టిక్స్‌లలో ఒకదాన్ని ఎంచుకోవచ్చు.

అర్హత: తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి/ తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఎన్ఐఓఎస్/టీఓఎస్ఎస్/ఏపీఓఎస్ఎస్/సీబీ ఎస్ఈ/ఐసీఎస్ఈ అభ్యర్థులు కూడా అర్హులే. సప్లిమెంటరీ అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు. విద్యార్థుల వయసు 2024 జూన్ 1 నాటికి 18 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులను 21 ఏళ్ల వరకు అనుమతిస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.450; ఇతర రాష్ట్రాల విద్యార్థులకు రూ.1500; గ్లోబల్ కేటగిరీలో మిగిలిన సీట్లకు పోటీ పడే విద్యార్థులకు రూ.1500; విదేశీ విద్యార్థులకు 100 యూఎస్ డాలర్లు
- **చివరి తేదీ:** జూన్ 22
- **వెబ్‌సైట్:** www.rgukt.ac.in

గ్రామీణ బ్యాంకుల్లో ఆఫీసర్, ఆఫీస్ అసిస్టెంట్స్

వివిధ రీజనల్ రూరల్ బ్యాంకు(ఆర్ఆర్‌బీ)ల్లో కింద పేర్కొన్న గ్రూప్-ఎ-ఆఫీసర్ (స్కేల్-1, 2, 3), గ్రూప్ బి-ఆఫీస్ అసిస్టెంట్(మల్టీపర్పస్) పోస్టుల భర్తీకి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్(ఐబీపీఎస్) నోటిఫికేషన్ విడుదల చేసింది.

గ్రామీణ బ్యాంకులు: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, కర్ణాటక గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, విదర్భ కొంకణ్ గ్రామీణ బ్యాంక్.

Institute of Banking Personnel Selection

- ఆఫీస్ అసిస్టెంట్(మల్టీపర్పస్): **5,585**, ఆఫీసర్ స్కేల్-1: **3499**, ఆఫీసర్ స్కేల్-2(అగ్రికల్చర్ ఆఫీసర్): **70**, ఆఫీసర్ స్కేల్-2(లా): **30**, ఆఫీసర్ స్కేల్-2(సీఏ): **60**, ఆఫీసర్ స్కేల్-2(ఐటీ): **94**, ఆఫీసర్ స్కేల్-2(జనరల్ బ్యాంకింగ్ ఆఫీసర్): **496**, ఆఫీసర్ స్కేల్-2(మార్కెటింగ్ ఆఫీసర్): **11**, ఆఫీసర్ స్కేల్-2(ట్రెజరీ మేనేజర్): **21**, ఆఫీసర్ స్కేల్-3: **129**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ, సీఏ, ఎంబీఏ ఉత్తీర్ణులై ఉండాలి.


ఎంపిక ప్రక్రియ: పోస్టును అనుసరించి ప్రిలిమ్స్ రాత పరీక్ష, మెయిన్స్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఉంటుంది.

దరఖాస్తు రుసుము: ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు రూ.175; మిగతా వారందరికీ రూ.850.

పరీక్ష కేంద్రాలు: అనంతపురం, గుంటూరు/విజయవాడ, కాకినాడ, కడప, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్/సికింద్రాబాద్, కరీంనగర్.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: జూన్ 27 **వెబ్‌సైట్:** www.ibps.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/e5Os0fLలో చదవండి.






టాలీవుడ్ అగ్ర నిర్మాత సి. అశ్వనీదత్ శుక్రవారం విజయవాడలో తెదేపా జాతీయ అధ్యక్షుడు, ఏపీ కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగు దేశం ఘన విజయం అందుకున్న సందర్భంగా చంద్రబాబు నాయుడుకు అభినందనలు తెలిపారు. టాలీవుడ్ యువ హీరో నిఖిల్ సిద్ధార్థ్ శుక్రవారం తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కలిశారు. మంగళగిరి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా లోకేశ్‌కు అభినందనలు తెలిపారు. నిఖిల్ మామయ్య, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్‌కు నిఖిల్ నటరాజ ప్రతిమను బహూకరించారు.



హిందూపురం ఎమ్మెల్యేగా వరుసగా మూడోసారి గెలుపొందిన నందమూరి బాలకృష్ణను టాలీవుడ్‌కు చెందిన పలువురు సినీ ప్రముఖులు కలసి అభినందనలు తెలిపారు. దర్శకుడు గోపీచంద్ మలినేని, బాబీ, అనిల్ రావిపూడి, నిర్మాత సూర్యదేవర నాగవంశీ తదితరులు బాలకృష్ణను కలసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

తమ్ముడూ... నిన్ను చూసి గర్విస్తున్నా



తమిళ హీరో, మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత కమల్‌హాసన్ జనసేనాని పవన్ కల్యాణ్‌ను అభినందనల్లో ముంచెత్తారు. ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఎన్నికల్లో జనసేన పార్టీ ఘన విజయాన్ని అందుకున్న సందర్భంగా 'నిన్ను చూసి గర్వపడుతున్నాను తమ్ముడూ అంటూ' పవన్‌పై ప్రశంసలు కురిపించారు. శుక్రవారం ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ ద్వారా పవన్ విజయంపై స్పందించారు. పవన్ కల్యాణ్ మున్ముందు తన రాజకీయ జీవితంలో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చిన పవన్ కల్యాణ్ ఈ ప్రయాణంలో విజయం సాధించాలి, ప్రజల ఆశలు, ఆకాంక్షలను సంపూర్ణంగా నెరవేర్చాలి అని ఆకాంక్షించారు.



మళ్లీ వస్తున్న ఉపేంద్ర 'ఏ'



కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర కథానాయకుడిగా నటించిన బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో 'ఏ' కు ప్రత్యేక స్థానం ఉంది. 26 ఏళ్ల క్రితం విడుదలైన ఈ చిత్రం అప్పట్లో ఓ కల్ట్ ఫిల్మ్‌గా నిలిచింది. ఎన్నో రికార్డులు నెలకొల్పింది. త్వరలో ఈచిత్రం మరోసారి తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఉప్పి క్రియేషన్స్, చందు ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్లపై 'ఏ' చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ నెల 21న ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నట్లు నిర్మాత లింగం యాదవ్ తెలిపారు. ఈ చిత్రంలో చాందినీ కథానాయికగా నటించారు.

ఇకపై ట్రోల్ చేయకండి

నటుడు ఉపేంద్ర ఆగ్రహం

'నన్ను మేధావి అంటూ ఇకపై ఎవరూ ట్రోల్ చేయకండి' అని ఉపేంద్ర అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ నేతృత్వంలోని జనసేన పార్టీ 21 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసి, అన్నింటా విజయం సాధించింది. దీంతో పవన్ కల్యాణ్‌తో ఉపేంద్రను పోలుస్తూ సోషల్ మీడియాలో పలువురు ట్రోల్ చేస్తున్నారు. ఉపేంద్ర 'ఉత్తమ ప్రజాకీయ పార్టీ'ని ఏర్పాటు చేసి పోటీ చేసినా ఒక్కచోటా గెలవలేకపోయారు. దీంతో ఆయనపై ట్రోల్స్ పెరిగాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం 'ఎక్స్' వేదికగా ఉపేంద్ర స్పందించారు. తన గెలుపోటముల గురించి సుదీర్ఘంగా ఆలోచిస్తున్నానని, తాను గెలవాలనుకున్నప్పుడు ఏదో ఒక రాజకీయ పార్టీలో చేరి విజయం సాధిస్తానని పేర్కొన్నారు. తన రాజకీయ పార్టీ 'ప్రజాకీయ' సిద్ధాంతాలు ప్రజలకు అర్థం కాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

- బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

యుద్ధానికి సిద్ధం!



ప్రభాస్ హీరోగా నటిస్తున్న భారీ చిత్రం 'కల్కి 2898 ఏడీ' ట్రైలర్ ఈ నెల 10న విడుదల కానుంది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతి మూవీస్ అధినేత అశ్వనీదత్ ప్రతిష్ఠాత్మకంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సినిమాలో అశ్వత్థామగా నటిస్తున్న అమితాబ్ బచ్చన్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. మధ్యప్రదేశ్‌లో నెమావార్‌లోని నర్మదా ఘాట్ దగ్గర ఏర్పాటు చేసిన ఓ మ్యాసివ్ ప్రొజెక్షన్ ద్వారా అమితాబ్ పాత్రను పరిచయం చేశారు. ఇప్పటికీ అశ్వత్థామ నర్మదా మైదానంలో నడుస్తాడనే నమ్మకం ఉండడంతో నర్మాదా ఘాట్‌లో అమితాబ్ లుక్‌ను విడుదల చేయం ప్రాధాన్యం సంతరించుకుంది. యుద్ధభూమి మధ్యలో నిలబడి ఓ అస్త్రాన్ని పట్టుకుని యుద్ధానికి సిద్ధంగా ఉన్నట్లు అమితాబ్ కనిపించారు. ఆయన నుదిటిపై ఉన్న రత్నం మెరుస్తోంది. ఆయన వెనుక ఓ భారీ వాహనం ఉంది, అలాగే ఆయన ముందు కొంతమంది వ్యక్తులు నేలపై పడి ఉన్నారు. ఈ నెల 27న విడుదల కానున్న 'కల్కి' చిత్రంలో కమల్‌హాసన్, దీపికా పదుకొణే, దిశా పటానీ ముఖ్య పాత్రలు పోషించారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/5tAR3Wo
లో చదవండి.

'కిక్కు'.. దించుతున్నారు

(మొదటి పేజీ తరువాయి)

విజయవాడలోని నున్న పోలీసులకు సమాచారం అదించారు. వారు స్పందించకపోవడంతో సీఐడీకి ఫిర్యాదు చేశారు. ఆయన కథనం ప్రకారం.. గురువారం ప్రసాదంపాడు ప్రాంతంలో ఉన్న ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ముందు నుంచి శివకృష్ణ స్నేహితుడితో కలిసి వాహనంలో వెళుతున్నారు. అక్కడ ఆగిఉన్న ఏపీ 39 ఎన్‌క్యూ 6666 నంబరు గల కారులో కొన్ని ఫైళ్లు, కంప్యూటర్ పరికరాలు, ఇతర పత్రాలను ఎక్కిస్తుండటం గమనించారు. తన స్నేహితుడితో కలిసి కొంత దూరం వాహనాన్ని వెంబడించారు. ఆ తర్వాత... ఫైళ్లు తీసుకెళ్లిన వ్యక్తి వాసుదేవ రెడ్డి అని తెలుసుకుని, నున్న పోలీసులకు తెలియజేశారు. వారు పట్టించుకోక పోవడంతో మంగళగిరి సీఐడీ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. శివకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గురువారం డీఎస్పీ శ్రీనివాసరావు ఎఫ్ఐఆర్(17/2024) నమోదు చేశారు. ఐపీసీ 427, 397, రెడ్ విత్ 120(బి) కింద కేసు పెట్టారు. దర్యాప్తునకు ముగ్గురు సీఐల నేతృత్వంలో బృందాలను ఏర్పాటు చేసి రంగంలోకి దించారు.

హైదరాబాద్‌లో సోదాలు...

హైదరాబాద్ నార్సింగిలోని పోలోమీ గేటెడ్ టౌన్‌షిప్‌లో ఉంటున్న వాసుదేవరెడ్డి నివాసానికి సీఐడీ బృందం వెళ్లింది. 12 మంది సభ్యుల బృందం శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు సోదాలు జరిపింది. ముఖ్యమైన డాక్యుమెంట్లు, ఫైళ్లు, హార్డ్ డిస్కులు స్వాధీనం చేసుకుంది. వాసుదేవ రెడ్డిని ప్రశ్నించి కీలక సమాచారాన్ని సేకరించినట్లు తెలిసింది. మద్యంషాపుల్లో డిమాండ్ ఉన్న కొన్ని మద్యం కంపెనీలకు ఆర్డర్లు ఎందుకు ఆపేశారు.. పేరుకూడా వినని కొన్ని కంపెనీల మద్యాన్ని భారీ ధరలకు ఎవరి ఆదేశాల మేరకు విక్రయించారని ఆరా తీశారు.

డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి...

తెలంగాణకు చెందిన వాసుదేవ రెడ్డి రైల్వేలో ఐఆర్‌టీఎస్ అధికారి. అనంతపురం జిల్లా గుంతకల్లులో పనిచేస్తూ వైసీపీ నేతలతో సంబంధాలు పెంచుకున్నారు. జగన్ ఓఎస్‌డీ కృష్ణమోహన్‌రెడ్డితో సాన్నిహిత్యం బాగా పెరిగింది. 2019లో ఏపీలో వైసీపీ అధికారంలోకి రాగానే ఏపీకి డిప్యుటేషన్‌పై వచ్చారు. ఆయనకు జగన్ బేవరేజెస్ కార్పొరేషన్ అప్పగించారు. ఎన్నికల సమయంలో వాసుదేవరెడ్డి వైసీపీ నేతలకు పూర్తిస్థాయిలో మద్యం అందుబాటులో ఉంచారు. డిపోల నుంచే ట్రక్కుల్లో రవాణా చేయించారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ప్రతిపక్షాలు ఫిర్యాదు చేశాయి. దీంతో ఆయనను ఈసీ పదవి నుంచి తప్పించింది. వాసుదేవరెడ్డి మామ మారెళ్ల పుల్లారెడ్డి. ఆయన... వైసీపీ మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు వియ్యంకుడు. ఆయన స్వగ్రామమైన ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం గౌరవరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. వాసుదేవ రెడ్డి అక్రమార్జనలో కొంత భాగం ఇక్కడ భూములపై పెట్టుబడి పెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. 2022 సెప్టెంబరులో వాసుదేవరెడ్డి భారీగా భూములు కొన్నట్లు సమాచారం. సుమారు 40 ఎకరాల భూమిని తన మామ నుంచి గిఫ్ట్ డీడ్ రూపంలో పొందారు. ఆ తర్వాత 2023 ఏప్రిల్‌లో సుమారు 25 ఎకరాల భూమిని పుల్లారెడ్డి కొనుగోలు చేశారు. సీఐడీ దీనిపైనా దృష్టి సారించే అవకాశముంది.

మద్యం స్కాం రూ.5వేల కోట్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వం మద్యం అమ్మకాల్లో భారీ కుంభకోణానికి పాల్పడింది. ప్రజల కోసం ప్రభుత్వ మద్యం షాపులు అని చెప్పి.. వాటి ద్వారా రూ.5వేల కోట్లు దోచేసింది. అది కాడా లిక్కర్ కంపెనీల నుంచి కాదు. కమీషన్లు ఇవ్వడం కోసం అంటూ అటు కంపెనీలకు రేట్లు పెంచి, ఆ పెంచిన మొత్తాన్ని ఇటు వైసీపీ నేతలు తమ ఖాతాల్లో వేసుకున్నారు. అంటే ప్రజాధనాన్ని ఆ చేత్తో కంపెనీలకు ఇచ్చి... ఈ చేత్తో జగన్ తన జేబులో వేసుకున్నారని అంచనా. అలా పోగేసిన రూ.5వేల కోట్లు హైదరాబాద్‌లో దాచిపెట్టి, తాజా ఎన్నికల్లో ఓట్ల కొనుగోలుకు వాడుకున్నట్లు ఆరోపణలున్నాయి. మిగిలిన మొత్తం బెంగళూరుకు తరలించారని తెలుస్తోంది. బేవరేజెస్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి ఇంట్లో శుక్రవారం జరిగిన సోదాల్లో దీనిపై మరింత కీలక సమాచారం బయటపడినట్లు సమాచారం. తెలుగుదేశం ప్రభుత్వంలో మద్యం షాపులు ప్రైవేటు వ్యాపారుల చేతుల్లో ఉండేవి. ఏ బ్రాండ్లు అమ్మాలనేది అప్పట్లో వారిష్టం. జగన్ దీనిని మార్చేశారు. ప్రభుత్వ మద్యం షాపుల విధానం ప్రారంభించారు. షాపుల్లో ఏ బ్రాండ్లు అమ్మాలో సర్కారు పెద్దలే నిర్ణయించారు. లిక్కర్ కేసుపై రూ.250, బీరు కేసుపై రూ.150 కమీషన్‌గా ఇవ్వాలని కంపెనీలకు ప్రతిపాదించారు. అలా ఇచ్చిన కంపెనీల మద్యమే కొన్నారు. రాష్ట్రంలోని డిస్టిలరీలను అనధికారికంగా 'స్వాధీనం' చేసుకుని.. రకరకాల పేర్లతో సొంత బ్రాండ్లను ప్రవేశ పెట్టారు. వాటినే మద్యం దుకాణాల్లో విక్రయించారు. అంటే... ఒకవైపు కమీషన్లు, మరోవైపు సొంతంగా మద్యం తయారు చేసి, బేవరేజెస్ కార్పొరేషన్‌తో కొనుగోలు చేయించి, ప్రభుత్వ దుకాణాల్లో విక్రయించడం! ఇలా అన్ని రకాలుగా ఆదాయమే! ఈ ఐదేళ్లలో 14.38కోట్ల కేసుల లిక్కర్, 5.83కోట్ల కేసుల బీరు రాష్ట్రంలో అమ్ముడైంది. ఇందులో లిక్కర్‌పై రూ.3600 కోట్లు, బీరుపై రూ.900 కోట్లు ప్రభుత్వం నుంచి కంపెనీలకు వెళ్లి, మళ్లీ తిరిగి వైసీపీ నేతలకు చేరాయి. మొదట ఈ నగదు వసూలును హైదరాబాద్ కేంద్రంగా నడిపారు. కంపెనీలకు బిల్లులు చెల్లించిన వెంటనే వెళ్లి హైదరాబాద్‌లో కేసుల చొప్పున కమీషన్లు ఇచ్చేవారు. ఈ క్రమంలోనే జగన్‌కు సన్నిహితంగా ఉండే ఓ ఫార్మా కంపెనీకి రూ.300 కోట్లు ఇచ్చారు. ఆ కంపెనీపై ఐటీ దాడులు జరిగి సీజ్ కావడంతో బెంగళూరుకు మార్చారని కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో ఐటీ కంపెనీ నడిపే వైసీపీ సన్నిహితుడు కసిరెడ్డి రాజశేఖరరెడ్డి ఈ వసూళ్లకు కేంద్ర బిందువు. తర్వాత అనేక మంది అందులోకి వచ్చారు.

ఎవరి పాత్ర ఏంటి?

ఈ తతంగం నడిపించేందుకు ఎక్సైజ్, బేవరేజెస్ కార్పొరేషన్‌లో అనేక మంది పనిచేశారు. కమీషన్లు ఇచ్చే కంపెనీలకే ఆర్డర్లు ఇచ్చే బాధ్యతను చివరివరకూ ఎండీగా పనిచేసిన వాసుదేవరెడ్డికి అప్పగించారు. ఆయన చెప్పిన కంపెనీలకు మాత్రమే ఆర్డర్లు వెళ్లాయి. మాకెందుకు ఇవ్వరని ప్రశ్నించిన కంపెనీలకూ కొన్నిసార్లు ఆర్డర్లు ఇచ్చారు. కానీ ఆ బ్రాండ్లను షాపుల్లో పెట్టి అమ్మకుండా, ఎవరూ కొనట్లేదని తిప్పి పంపారు. ఇక ఏ రోజు ఏ బ్రాండ్లు ఎక్కువ అమ్మాలి అనేది ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సత్యప్రసాద్ చూసుకున్నారు. దీనికి సంబంధించిన చార్టు 'తాడేపల్లి' పెద్దల నుంచి అందేది. కంపెనీలకు బకాయిల విడుదల అంశాన్ని రిటైర్డ్ కార్పొరేషన్ అధికారి వేణుగోపాల్ చూశారు. ప్రతి బిల్లులో 20శాతం కమీషన్ విడుదల చేశారు. 90 రోజులుగా స్టాకు అమ్ముడుపోలేదనే కారణాన్ని చూపి ఎడాపెడా గ్రౌండింగ్ చార్జీలను రిటైర్డ్ కార్పొరేషన్ అధికారి శ్రీనివాసరెడ్డి తీసుకున్నారు. తొలుత ఎడాపెడా గ్రౌండింగ్ చార్జీలు విధించేవారు. తర్వాత వాటి అసలు లెక్కలు అంచనావేసి అందులో అసలు చార్జి పోను మిగిలింది తిరిగి కంపెనీలకు ఇచ్చేందుకు 20శాతం కమీషన్ వసూలుచేశారు. అటు కేసులపై కమీషన్లు, ఇటు కార్పొరేషన్‌లో వసూళ్లు కలిపి మొత్తంగా రూ.5వేల కోట్లకు పైగానే ప్రజాధనాన్ని దోపిడీ చేశారు. మార్కెట్ ఆధారంగా మద్యం కంపెనీలు కొత్త కొత్త పేర్లతో బ్రాండ్లు విడుదల చేస్తుంటాయి. తయారీ, సరఫరా ఇతరత్రా కారణాల దృష్ట్యా ప్రతి కంపెనీ ఎక్కువ పేర్లతో బ్రాండ్లు అమ్ముతుంది. అంటే ఒకే బ్రాండ్‌కు చివర్లో డీలక్స్, ప్రీమియం, స్ట్రాంగ్, లైట్ ఇలా వేర్వేరు పేర్లతో బ్రాండ్లను రిజిస్ట్రేషన్ చేసుకుంటుంది. ఇలా ఏదైనా కొత్త రిజిస్ట్రేషన్ చేసుకుంటే దానికి ఎక్సైజ్ శాఖ లేబుల్ ఇవ్వాలి. దానికి కార్పొరేషన్‌లో రూ.50లక్షలు చొప్పున వసూలు చేశారు. ప్రతి ఏటా రెన్యువల్‌కు ఒక్కో లేబుల్‌కు రూ.5లక్షలు తీసుకున్నారు.

గురుదేవా ట్రస్టు ఆవరణలో జాబ్ మేళా

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామంలో ఉన్న గురుదేవ చారిటబుల్ ట్రస్టు ఆవరణలో శుక్రవారం రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో దివ్యాంగులకు, ఇతరులకు జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రిలయన్స్ కంపెనీకి చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే 20 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్ కుమార్, వైస్ చైర్మన్ ఫణీంద్ర, ట్రస్టు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గుల్లే మిర్జ్ షాంబాబా ఉర్సు మహోత్సవం

విజయనగరం రూరల్: నగరంలోని కుమ్ముందన్ వీధిలో ఉన్న హజరత్ సయ్యద్ గుల్లేమిర్జ్ షాంబాబా 37వ ఉరుసు మహోత్సవం శనివారం జరుగుతుందని దర్గా కమిటీ ప్రతినిధులు ఎస్‌కే దాదా, ఎస్‌కే జానీ, మహ్మద్ గౌస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రార్థనల అనంతరం రాత్రికి భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ప్రముఖ మత గురువులు హాజరౌతారని తెలిపారు. ముస్లింలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పాఠశాల మైదానం ఆక్రమణపై చర్యలు తీసుకోండి

విజయనగరం రూరల్: మండల పరిధిలోని సుంకరిపేట గ్రామ పాఠశాల మైదాన భూమిని వైసీపీ నాయకులు అన్యాయంగా ఆక్రమించుకుని, రెవెన్యూ అధికారులతో చేతులు కలిపి అక్రమంగా మ్యూటేషన్ చేయించారని, దీనిని తక్షణమే రద్దు చేయాలని సుంకరిపేట గ్రామస్థులు రామానాయుడు, పైడిరాజు, సీతారాం తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మైదాన భూమిని అధికారులు ఎలా మ్యూటేషన్ చేస్తారని ప్రశ్నించారు. తక్షణమే మ్యూటేషన్‌ను రద్దు చేసి, మైదానాన్ని తిరిగి ఆ పాఠశాలకు చెందే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

విజయనగరం దాసన్నపేట: నగరంలోని అలకానంద కాలనీలో తమన్నా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెట్విజ్ సీఈవో రామ్‌గోపాల్, నాలుగెస్సల రాజు, దిశా మహిళా పోలీసుస్టేషన్ ఎస్ఐ నీలావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఈవో రామ్‌గోపాల్ మాట్లాడుతూ, పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. తమన్నా ఫౌండేషన్ అధ్యక్షులు బొడ్డేపల్లి రామకృష్ణారావు, నాగమణి, కృష్ణమూర్తి, రమేష్, మహేష్, వీరనారి తదితరులు పాల్గొన్నారు..

అధికారులు శ్రద్ధగా పనిచేయాలి

బాడంగి, జూన్ 7: ఏ ఒక్క అధికారి అయినా ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు అన్నారు. శుక్రవారం తెంటు నివాసం వద్ద స్థానిక ఎంపీడీవో ఆంజనేయులు సిబ్బందితో వెళ్లి పుష్పగుచ్ఛం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రజల కోసమే పాటుపడాలని, పదవులు శాశ్వతం కాదని అన్నారు. ఉద్యోగులు జీతాలను ప్రజలు చెల్లించే పన్నులతో పొందుతున్నారని, వారి అభివృద్ధి కోసం పాటుపడాలని, గత ప్రభుత్వంలో లా కాకుండా ఈ ప్రభుత్వంలో అధికారులకు వేధింపులు ఉండవని, స్నేహపూర్వకంగా ప్రజలతో మసలుకొని నిర్భయంగా మీ ఉద్యోగాలు చేసుకోవాలన్నారు. అభినందించినవారిలో ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు అల్లాడ జయప్రకాష్, సూర్యారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ

శృంగవరపుకోట, జూన్ 7: శృంగవరపుకోటలో నెలరోజులుగా జరుగుతున్న షటిల్ బ్యాడ్మింటన్ వేసవి క్రీడా శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుకూరి రఘురాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శిక్షణలో పాల్గొన్న క్రీడాకారుల మధ్య జరిగిన పోటీలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. చీఫ్ కోచ్ పొట్నూరు శ్రీరాములు ఉన్నారు.

ఎన్నికల కమిషన్‌కు అభినందనలు

శృంగవరపుకోట, జూన్ 7: ఎన్నికలను సజావుగా నిర్వహించిన భారత ఎన్నికల కమిషన్‌కు అక్షరాస్యత ప్రతినిధులు అభినందనలు తెలిపారు. శుక్రవారం ఈ మేరకు శృంగవరపుకోట ఉప తహసీల్దార్ భరత్‌కు వినతిపత్రం అందించారు. ఓటరు ఎక్కడి నుంచైన తమ ఓటుహక్కును వినియోగించుకునేలా సంస్కరణలు తేవాలని వేదిక ప్రతినిధి డి.సూర్యారావు కోరారు. ఎం.ఎస్.ఎన్ మూర్తి, లంక సాంబమూర్తి తదితరులు ఉన్నారు.



ఎస్.కోట ఉప తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న అక్షరాస్యత ప్రతినిధులు

ప్రజల మనోభావాలతో ఆడుకుంటే భూస్థాపితం చేస్తారు

● బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు

బొబ్బిలి, జూన్ 7: ప్రజల మనోభావాలతో ఆడుకుంటే రాజకీయాలకు పనికి రాకుండా పూర్తిగా భూస్థాపితం చేస్తారని ఈ ఎన్నికల్లో రుజువైందని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగా రావు(బేబీనాయన) అన్నారు. శుక్రవారం తన నివాసంలో కూటమి నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమి ఎవరికైనా వంద పాఠాలు నేర్పుతుందని, కానీ వైసీపీ అధినేత ఒక్క పాఠాన్ని నేర్చుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఓటర్లను అవహేళన చేయడం, వారిచ్చిన తీర్పును తప్పుబడుతూ మాట్లాడడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రజలు చారిత్రాత్మక తీర్పును వెలువరించారని, ఇది ముమ్మాటికీ ప్రజల విజయమన్నారు. శాడిజం, దౌర్జన్యం, అవినీతి, అక్రమాలు, వేధింపులు ఇలా ఎన్నో ప్రజావ్యతిరేక విధానాలతో పరిపాలన సాగించిన జగన్‌కు ప్రజలంతా గట్టి గుణపాఠం చెప్పారన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటును ఎట్టి పరిస్థితుల్లోనూ చీలిపోకుండా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. వైసీపీ హయాంలో తెలుగుదేశం నాయకులు ఇతర పార్టీ శ్రేణులంతా ఎన్నో కష్టనష్టాలకు ఓర్చారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఎక్కడా ఎటువంటి సంబరాలు, సభలు, సన్మానాలు తన కోసం పెట్టవద్దని సూచించారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవడమే ఏకైక లక్ష్యంగా అందరం కలిసికట్టుగా పనిచేద్దామని బేబీనాయన పిలుపునిచ్చారు. ఇందుకోసం మంచి అధికారులను, సిబ్బందిని నియమించుకుందామన్నారు. ఎటువంటి సిఫారసులు, లాబీయింగ్‌లకు తావులేకుండా మంచి సేవాభావం కలిగిన వారిని గుర్తించి పోస్టింగ్‌లు కల్పిస్తామన్నారు. టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు మాట్లాడుతూ రాష్ట్రాన్ని గుడ్డలిప్పి నడిరోడ్డుపైకి జగన్ నెట్టారని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తే ఫలితాలు ఇలానే ఉంటాయని, వైసీపీకి ఇవే ఆఖరి ఎన్నికలని తెంటు అన్నారు. బేబీనాయన రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఎమ్మెల్యేగా రాణించాలని అన్నారు. మున్సిపల్ కౌన్సిలరుగా వైసీపీ తరఫున ఎన్నికైన తరువాత ప్రజలకు ఏమీ చేయలేకపోవడంతో ఆ పార్టీకి గుడ్‌బై మూడేళ్ల క్రితమే బయటకు వచ్చేశానని బీజేపీ నాయకుడు మరిశర్ల రామారావునాయుడు అన్నారు. జనసేన నాయకులు పాలూరు బాబు, పెద్దింటి మనోజ్ కుమార్ మాట్లాడుతూ వైసీపీ నాయకులు విధ్వంసకర పాలన సాగించి ప్రజలను ఇబ్బందుల పాలు చేశారని, అందుకు తగిన శాస్తి జరిగిందన్నారు. బొబ్బిలి ఎమ్మెల్యేకు సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జనసేన నాయకుడు లంక రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బేబీనాయన, కూటమి నాయకులు

జేఎస్ఎల్ కార్మికులకు దళిత సంఘాల సంఘీభావం



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

కొత్తవలస, జూన్ 7: జిందాల్‌నగర్‌లోని జేఎస్ఎల్ కర్మాగారం ఎదుట కార్మికులు చేస్తున్న సమ్మెకు శుక్రవారం వివిధ దళిత సంఘాలకు చెందిన నాయకులు తమ సంఘీభావం తెలిపారు. శుక్రవారం కార్మికులు కర్మాగారం ఎదుట నినాదాలతో హోరెత్తించారు. లాకౌట్ విధించినప్పుడు చట్టబద్ధంగా రావలసిన లే ఆఫ్‌ను తమకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొందరు కార్మికులకే లే ఆఫ్ ఇస్తామని యాజమాన్యం మొండి పట్టు పట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కర్మాగారంలో పనిచేసిన ప్రతి కార్మికుడికీ లాకౌట్ ఎన్నిరోజులు ఉంటే అన్ని రోజులకు లే ఆఫ్ ఇవ్వాలన్నారు. కార్మికుల మధ్య విభేదాలను సృష్టించడానికే కొంతమందికి లే ఆఫ్ ఇస్తామని యాజమాన్యం అంటోందని ఆరోపించారు. విభజించు పాలించు అనే విధంగా యాజమాన్య వైఖరి ఉందని కార్మికులు అన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం కార్మికులందరికీ లే ఆఫ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు పిల్లా అప్పలరాజు, కోన దేముడు నమ్మిచినబాబు, బొట్టారాము తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌డీఏ కూటమితోనే దేశాభివృద్ధి



మాట్లాడుతున్న భవిరెడ్డి

విజయనగరం దాసన్నపేట, జూన్ 7: దేశంలో ఎన్‌డీఏ కూటమితోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు భవిరెడ్డి శివప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అటు దేశంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ ఎన్‌డీఏ కూటమికి మద్దతు ఇచ్చిన ప్రజలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మూడోసారి ముచ్చటగా ప్రధానిగా నరేంద్ర మోదీ పగ్గాలు చేపట్టడం శుభపరిణామమన్నారు. అదే సమయంలో ఏపీలో ఎన్‌డీఏ కూటమి నుంచి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపడుతున్నారని, రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. జిల్లాలో విజయనగరం ఎమ్మెల్యేగా అదితి గజపతిరాజు భారీ ఓట్ల మెజార్టీతో ప్రజలు పట్టం కట్టడం శుభ పరిణామమన్నారు. సుధీర్, అప్పారావు దొర, బూర జగ్గారావు, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బీసీ వసతి గృహాన్ని పట్టణంలో ఏర్పాటు చేయాలి

బొబ్బిలి, జూన్ 7: బొబ్బిలి పట్టణంలో ఉండే బీసీ కళాశాల వసతి గృహాన్ని తక్షణం వెనక్కి రప్పించి తిరిగి పట్టణంలో ఏర్పాటు చేయాలని ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.సాయికిరణ్‌యాదవ్ డిమాండ్ చేశారు. పూల్‌బాగ్‌లో శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. బొబ్బిలి పట్టణంలో ఉండే బీసీ కళాశాల వసతిగృహాన్ని గత ప్రభుత్వ హయాంలో అధికారులు వైసీపీ నాయకుల ఒత్తిడికి, అవినీతికి తలొగ్గి మండలంలోని ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న కోమటిపల్లికి తరలించారన్నారు. దీనిని వెంటనే తిరిగి రప్పించాలని విద్యార్థి సంఘాలు పలు దఫాలు ఆందోళనలు చేపట్టినప్పటికీ అధికారులు స్పందించలేదని ఆరోపించారు. సెలవుల అనంతరం కళాశాలలు తెరిచారని, కొత్తగా బీసీ కళాశాల కూడా వచ్చిందని అయినప్పటికీ పట్టణానికి దూరంగా వసతిగృహం ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణంలో బీసీ వెల్ఫేర్ శాఖకు సొంతభవనాలు ఉన్నప్పటికీ ఈ తప్పిదం చేయడం, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమన్నారు. ఈ వసతిగృహాన్ని బొబ్బిలి పట్టణంలోని సొంత భవనంలోనికి మార్చాలని సాయికుమార్ డిమాండ్ చేశారు. మణికుమార్, సతీష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు

నాణ్యమైన సరుకులు అందించాలి

● ఐటీడీఏ పీవో శుభం బన్సాల్



టెండర్లను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో

సీతంపేట: ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతిగృహాలకు నాణ్యమైన సరుకులను సరఫరా చేయాలని పీవో శుభం బన్సాల్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏలోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన నిత్యావసర సరుకుల టెండర్‌ను ఆయన పరిశీలించారు. జీసీసీ ద్వారా అన్ని వసతిగృహాలు, గురుకులాలకు అవసరమైన నిత్యావసర సరుకుల పంపిణీకి సంబంధించి టెండర్లు నిర్వహించినట్లు తెలిపారు. టెండర్‌దారులు నాణ్యమైన సరుకులు పంపిణీ చేయాలని, ఈ విషయంలో ఎటువంటి తేడా రాకూడదని స్పష్టం చేశారు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర, జీసీసీ డీఎం సంధ్యారాణి, పాతపట్నం, సీతంపేట జీసీసీ బ్రాంచి మేనేజర్లు కృష్ణ, జి.నరసింహులు, కార్యాలయ సూపరింటెండెంట్ దేశ్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



వెంకటేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న కోళ్ల దంపతులు

లక్కవరపుకోట, జూన్ 7: మండలంలోని లచ్చంపేట గ్రామంలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆయల ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్.కోట నియోజకవర్గ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దంపతులు హాజరయ్యారు. ఉదయం నుంచి ఆలయ పండితులు మధుకుమార్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు అన్నదానం నిమిత్తం రూ.10వేలు విరాళం అందజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ రాంప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు చొక్కాకుల మల్లునాయుడు, గ్రామ సర్పంచ్ బి.యర్రయ్యమ్మ, వేపాడ, ఎల్.కోట టీడీపీ నేతలు పాల్గొన్నారు.

చిన్నారుల ఎదుగుదల, అభివృద్ధిపై శిక్షణ



అంగన్‌వాడీ, ఆశాలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

రేగిడి, జూన్ 7: చిన్నారుల ఆరోగ్యం, ఎదుగుదల, వారి అభివృద్ధిపై తల్లిదండ్రులు ప్రత్యేకశ్రద్ధ ఉండేలా చైతన్యం పెంపొందించాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు, సీహెచ్‌కో సీహెచ్‌కెలహెచ్‌ఓ సుందరేశ్వరరావులు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రేగిడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు, ఆశాకార్యకర్తలకు చిన్నారుల ఎదుగుదల, వారి అభివృద్ధిచర్యలపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో రిసోర్స్‌పర్సన్‌లుగా ఎంఎల్‌హెచ్‌వో ప్రియ, రేగిడి సెక్టార్ సూపర్‌వైజర్ శశికళ వ్యవహరించి పిల్లల ఎదుగుదల, వారి సంరక్షణ, ఆరోగ్యజాగ్రత్తలపై వివరించారు. ఈ శిక్షణను రాజాం ఐసీడీఎస్ పీవో కనకదుర్గ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సంకిలి సెక్టార్ సూపర్‌వైజర్ బంగారమ్మ, పలుగ్రామాల అంగన్‌వాడీలు, ఆశాకార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జ్వరాలపై పర్యవేక్షణ: డీఎంవో



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంవో

గుమ్మలక్ష్మీపురం: జ్వరాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని జిల్లా మలేరియా అధికారిజగన్మోహన్‌రావు ఆదేశించారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని ఎస్.కలిగొట్టులో వైద్య సిబ్బంది చేపట్టిన ఫీవర్ సర్వే, దోమల నియంత్రణ చర్యలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జ్వర లక్షణాలతో ఉన్న వారి నుంచి సేకరించిన రక్తపూతల స్లైడ్స్, ఆర్‌టీడీ పరీక్షలు పరిశీలించారు. రక్తపూతలను తాడికొండ ఆరోగ్య కేంద్రానికి అందజేసి జ్వర నిర్ధారణ జరపాలని ఆదేశించారు. గ్రామంలో చికిత్స పొందు తున్న ఇద్దరు జ్వర పీడితుల ఇళ్లకు వెళ్లి.. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వీబీటీ కన్సల్టెంట్ జి.రామచంద్ర, జె.మోహనరావు తదితరులున్నారు.

లారీ, ఆటో ఢీ.. ఐదుగురికి గాయాలు

పార్వతీపురంటౌన్, జూన్ 7: లారీ, ఆటో ఢీకున్న ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఔట్‌పోస్టు పోలీసులు, క్షతగాత్రుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం 5 గంటల సమయంలో మన్యం జిల్లా వీరఘట్టాం మండలం హుస్సేన్ పురం నుంచి ఐదుగురు ఆటోలో పార్వతీపురం వస్తున్నారు. పట్టణంలోని కొత్తవలస ఫ్లైఓవర్‌పైకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీని ఆటో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆటో డ్రైవర్ సుందరపాల్, కరుణశ్రీ, నాని, పిల్లలు అని, స్టీఫెన్‌లకు గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తీసుకువచ్చి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలైన నాని ప్రత్యేక వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నాడని, అవసరమైయితే విశాఖకు పంపిస్తామని కీళ్ల, ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ శేషగిరి తెలిపారు. ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

గజపతినగరం, జూన్ 7: బాలికను మాయమాటలతో మోసం చేసి గర్భవతిని చేసిన నేరానికి నిందితుడిపై పోక్సోకేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్ శుక్రవారం తెలిపారు. గజపతినగరం మండలం ఒక గ్రామానికి చెందిన బాలికను బొండపల్లి మండలానికి చెందిన యువకుడు ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేశాడని బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

దత్తిరాజేరు, జూన్ 7: మండలంలోని పెదమానాపురం రైల్వే గేటు, కోమటిపల్లి రైల్వేస్టేషన్ మధ్యలో, ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్సై రవివర్మ తెలిపారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతుని శరీరంపై తెలుపు రంగు లాల్చీ, స్కైబ్లూ ప్యాంటు ఉందని, వయసు సుమారు 60 ఏళ్ళు ఉంటాయని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మరో రైలు ప్రమాదంలో...

గోపాలపట్నం, జూన్ 7: గోపాలపట్నం నుంచి కొత్తపాలెం వెళ్లే అండర్‌పాస్‌వే సమీపాన గుర్తు తెలియని రైలు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. విజయనగరం జిల్లా పూసపాటిరేగ సమీపంలోని కుమిలి గ్రామానికి చెందిన కర్రి వసంతకుమార్ (19) ఐటీఐ పూర్తి చేసి అప్రెంటిస్ చేసేందుకు విశాఖ వచ్చాడు. కొత్త పాలెంలో బంధువుల ఇంటివద్ద ఉంటున్నాడు. గురువారం రాత్రి భోజనం చేసిన తరువాత బహి ర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వచ్చాడు. ఎంతకీ రాకపోవడంతో బంధువులు ఉదయం పరిసర ప్రాంతాల్లో వెతికారు. రైల్వే ట్రాక్‌పై మృతదేహం పడిఉందన్న సమాచారంతో రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా బంధువులకు సమాచారం అందించారు. కొద్ది రోజులుగా బంధువుల ఇంటివద్దనే ఉంటున్న వసంతకుమార్ అనుకోని వి ధంగా జరిగిన ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీ రుమున్నీరవుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కేజీహెచ్‌కు తరలించి జీఆర్‌పీ ఎస్సై బాలాజీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించారు


విజయనగరం దాసన్నపేట, జూన్ 7: సార్వత్రిక ఎన్నికలను జిల్లాలో కలెక్టరు నాగలక్ష్మి, జిల్లా అధికారులు సమర్థవంతంగా నిర్వహించారని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరు నాగలక్ష్మి, డీఆర్‌వో అనితలను అభినందించి, సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో కలెక్టర్, ఎస్పీ, డీఆర్వో, ఆర్‌డీవో మహిళా అధికారులు ఉన్నప్పటికీ, ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు, ఎన్నికల విధి నిర్వహణలో సమస్యలు లేకుండా చాలా అద్భుతమైన పనితీరును కనబరిచారన్నారు. రామచంద్రరాజు, ఇప్పలవలస గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ నాగలక్ష్మిని అభినందిస్తున్న భీశెట్టి

పూర్తికాని పైపులైన్ మరమ్మతులు

రాజాం, జూన్ 7: ప్రధాన పైపులైన్‌లు మరమ్మతులు చేపట్టినప్పటికీ సాంకేతిక సమస్య కారణంగా పూర్తిస్థాయిలో పనులు జరగలేదని అందుకు శనివారం కూడా పలు ప్రాంతాలకు తాగునీరు సరఫరా ఉండదని కమిషనర్ జె రామప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మండల విద్యాశాఖ కార్యాలయం ఆవరణలో ప్రధాన పైపులైన్లు పాడైనందున వాటి స్థానంలో కొత్తవాటిని వేయడానికి శుక్రవారం పనులు చేపట్టినప్పటికీ వెల్డింగ్ పనులు పూర్తికానందున శనివారం పూర్తిస్థాయిలో మరమ్మతు పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నామని, అందుకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, అమ్మవారి కాలనీ, మెంతిపేట ఎస్సీ కాలనీ, ఆదర్శనగర్ కాలనీ, కొండంపేట, మాదిగ వీధి, చాకలివీధి, వస్త్రపురికాలనీ, గోపాలపురం, కొత్తవలస, తిమ్మయ్యపేట, ఈ విషయంలో సహకరించాలని కోరారు.



పిల్లల్లో సృజనాత్మకత పెంచేందుకే శిక్షణ

● గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతుల ముగింపు

విజయనగరం రూరల్, జూన్ 7: పిల్లల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు ప్రభుత్వం వేసవి సెలవుల్లో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా పౌర సంబంధాల అధికారి రమేష్ చెప్పారు. 24 రోజులుగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పిల్లలకు వివిధ అంశాలపై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, పిల్లల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఇది మంచి అవకాశమన్నారు. ఈ శిబిరాన్ని నిర్వహించిన గ్రంథాలయ సంస్థను ఆయన అభినందించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి లక్ష్మి, రాజశేఖర్, ఈశ్వర్, షన్ముఖ ప్రియ, వయోజన విద్య ఉప సంచాలకులు సోమేష్ తదితరులు పాల్గొన్నారు. ● **రామభద్రపురం:** గ్రంథాలయాలను వినియోగించుకుని యువత జ్ఞానం పెంపొందించుకోవాలని మండల విద్యాశాఖాధికారి ఆమిటి తిరుమలప్రసాద్ కోరారు. మండల కేంద్రంలో ఉన్న శాఖా గ్రంథాలయంలో గత 24 రోజులుగా జరిగిన విద్యార్థుల పఠనం, పలు రకాల పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు జ్ఞాన నిధులని అన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. ప్రముఖ కవి దాలినాయుడు మాష్టారు మాట్లాడుతూ గ్రంథాల యాలకు వెళ్లడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర నాయకురాలు కే.విజయగౌరి, ఉపాధ్యాయులు శివుడు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. ● **బాడంగి:** పిండ్రంగివలస ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రంథాలయాధికారుల ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతుల ముగింపునకు మండల విద్యాశాఖాధికారి రాజేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులను వినియోగించుకున్న విద్యార్థులను అభినందించారు. గ్రంథాలయాధికారి దుర్గాప్రసాద్, బాడంగి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రహీమ్, విద్యార్థులు పాల్గొన్నారు. ● **బొబ్బిలి:** స్థానిక ప్రభుత్వ శాఖా గ్రంథాలయంలో గత నెల 15న ప్రారంభించిన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. లైబ్రేరియన్ ఎస్. స్వర్ణకుమారి ఆధ్వర్యంలో 24 రోజుల పాటు చిన్నారులకు విజ్ఞానదాయకమైన అంశాలపై ఆసక్తిని, అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉపాధ్యాయుడు శ్రీరామ్మూర్తి, మాజీ సైనికోద్యోగి వీఎస్ శర్మ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో చిన్నారులకు ఈ శిబిరం ఎంతో ప్రయోజనకరమన్నారు. ఆటల పోటీలు, చిత్రలేఖనం, రాత పోటీలలో విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ● **గుర్ల:** స్థానిక శాఖా గ్రంథాలయంలో గత నెల 15 నుంచి నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఎంఈవో భానుప్రకాష్, జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ప్రసాద్ హాజరై, మాట్లాడారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ● **గరివిడి:** గరివిడి శాఖా గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖాధికారి పి.రామారావు పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా యూటీఎఫ్ నాయకులు సత్యశ్రీనివాస్, ఎస్ సత్యనారాయణరాజు పాల్గొన్నారు. ● **లక్కవరపుకోట:** గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరం ఆఖరు రోజున విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించి అదరగొట్టారు. గ్రంథాలయ అధికారి బి.మేరీనిర్మల ఆధ్వర్యంలో విద్యార్థులు డ్యాన్సులు, కథలు, కావ్యాలు, ఆటలు, పాటలతో అలరించారు. వేసవిలో వారు నేర్చుకున్న విద్యను ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



విజయనగరం: మాట్లాడుతున్న రమేష్



గుర్లలో..



రామభద్రపురంలో...



బాడంగిలో...



గరివిడిలో..

నాసిరకం విత్తనాలతో జాగ్రత్త!

- విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోలులో అప్రమత్తతే ప్రధానం
- ఆర్బీకేలు, వ్యవసాయ సొసైటీల వద్ద కొనుగోలు చేయడం ఉత్తమం
- రైతులకు సూచిస్తున్న వ్యవసాయ అధికారులు

గరుగుబిల్లి: ఖరీఫ్ సీజన్ సమయం దగ్గరవుతోంది. ఆడపాదడపా కురుస్తున్న వర్షాలకు భూమిని సిద్ధం చేయడంలో రైతులు నిమగ్నమయ్యారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఎరువులు, పురుగు మందులు విక్రయించే డీలర్లు కూడా నిబంధనలు పాటించాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. 1985 ఎరువుల నియంత్రణ పట్టాన్ని డీలర్లు పాటించాలని సూచిస్తున్నారు.

గుర్తింపు ఉంటేనే...

వ్యవసాయశాఖ లైసెన్స్ పొందిన డీలరు, గుర్తింపు పొందిన సంస్థల వద్ద మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలి. సరిగ్గా సీలు వేసి ధ్రువీకరణ పత్రం ఉన్న విత్తన బస్తాలనే కొనుగోలు చేయాలి. విత్తనాల సంచిపై విత్తన రకం, ల్యాట్ నెంబరు, గడువు తేదీ, తదితర విషయాలు ఉన్నవీ లేనివీ గమనించాలి. కొనుగోలు చేసిన బిల్లుపై డీలరు సంతకం ఉండాలి. రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి. వ్యవసాయాధికారులు సూచించిన విత్తనాలను కొనుగోలు చేస్తే మంచిది. హైబ్రిడ్ విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు విత్తనం రకం, స్వచ్ఛత, మొలకెత్తే స్వభావం, జన్యు నాణ్యత వంటి వివరాలను నిర్ధారించుకోవాలి. మొలకెత్తే దశ, పూత దశలో లోపం కనిపిస్తే మండల వ్యవసాయాధికారిని సంప్రదించాలి.

విక్రయానికి గుర్తింపు పత్రం..

ఎరువులను విక్రయించే వారు ప్రభుత్వం నుంచి విధిగా గుర్తింపు పత్రం పొందాలి. నమోదు పత్రంలో పొందుపరిచిన ఎరువులనే విక్రయించాలి. డీలర్లు తమ వద్ద ఉన్న ఎరువులను, వాటి ధరలను స్టాక్ బోర్డుపై ప్రదర్శించాలి. రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు విధిగా బిల్లులు ఇవ్వాలి. నిర్ణయించిన ప్రమాణం లేని ఎరువులను డీలర్లు విక్రయించరాదు. బస్తాలపై చట్ట ప్రకారం నిర్దేశించిన ప్రామాణికాలు లేని ఎరువులను విక్రయించరాదు. కల్తీ, నాణ్యత లోపించిన ఎరువులు, చిరిగిన, తేమ వచ్చిన బస్తాలు ఉంటే వాటిపై ఎర్రటి సిరాతో గుర్తు వేసి పక్కన పెట్టేయాలి. అటువంటి వాటిని రైతులు కొనుగోలు చేయరాదు.

విత్తన శుద్ధి తప్పనిసరి

కిలో విత్తనాలకు రెండున్నర గ్రాముల కార్బన్‌డైజం కలిపి 24 గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. నీటిలో నానబెట్టినట్లయితే లీటరు నీటికి ఒక గ్రాము కార్బన్‌డైజమ్‌ను కలిపి ఆ ద్రావణంలో 24 గంటలు నానబెట్టి మండి కట్టి నారుమడిలో చల్లుకోవాలి. విత్తనం నానబెట్టడానికి ఒక కిలో విత్తనానికి ఒక లీటరు నీరు సరిపోతుంది. కార్బన్‌డైజమ్ కాకుండా విత్తన శుద్ధికి సూడోమోనాస్ ఫ్లోరసెస్ అనే జీవ శిలీంధ్ర నాశినిని కూడా ఉపయోగించవచ్చు. ఈ శిలీంధ్రం వ్యవసాయశాఖ వద్ద మాత్రమే లభిస్తుంది. సూడోమోనాస్ ఫ్లోరసెస్ మందును కేజీ విత్తనాలకు ఎనిమిది గ్రాముల మందును వినియోగించాలి. దీనివల్ల భూమి నుంచి శిలీంధ్రం ద్వారా వచ్చే తెగుళ్లను సమర్థవంతంగా అరికట్టవచ్చు. రైతులు సొంత విత్తనాలు వినియోగించడం మంచిది.



విత్తనాలను ఆర్బీకే వద్ద దించుతున్న కూలీలు(ఫైల్)

మొలక పరీక్ష చేసుకోవాలి

రైతులు విత్తుకోవడానికి ఒక రోజు ముందు విత్తనాలు కొనుగోలు చేయడం వల్ల మొలక శాతం పరీక్షించడం లేదు. ఇది మంచిది కాదు. విత్తనం కొనుగోలు చేసిన తర్వాత తప్పనిసరిగా మొలక శాతం పరీక్షించుకోవాలి. రైతు కొనుగోలు చేసిన విత్తనాల నుంచి 100 గింజలను తీసుకుని 24 గంటల పాటు నీటిలో నానబెట్టి, అనంతరం ఒక గుడ్డలో గాలి, వెలుతురు తగలని ప్రదేశంలో ఉంచాలి. 24 గంటల తర్వాత తీసి చూస్తే 100 గింజలకు 75 గింజల పైబడి మొలక వస్తే మంచి విత్తనంగా నిర్ధారించుకుని నారుమడి వేసేందుకు సిద్ధం చేసుకోవాలి. లేదంటే విత్తన బస్తాను తిరిగి కొనుగోలు చేసిన చోట ఇచ్చేయాలి.

నాణ్యమైన విత్తనంతో అధిక దిగుబడి



రైతులు విత్తన ఎంపికలో జాగ్రత్తలు వహించాలి. నాణ్యమైన విత్తనంతోనే అధిక దిగుబడులు వస్తాయి. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను వ్యవసాయ సొసైటీలు, రైతుభరోసా కేంద్రాలు, ప్రైవేటు డీలర్ల వద్ద అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయశాఖ చర్యలు తీసుకుంది. ఎక్కడా ఎరువులు, విత్తనాల కొరత వచ్చే ప్రసక్తే ఉండదు.

- ఆర్.విజయభారతి, మండల వ్యవసాయాధికారిణి, గరుగుబిల్లి

ప్రజా సమస్యలు పరిష్కరించాలంటూ..

- బేబీనాయనను కలిసిన ఉద్యోగులు, అధికారులు



బేబీనాయనతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ తిరుమలరావు

బొబ్బిలి: ఎమ్మెల్యేగా ఎన్నికైన బేబీనాయనకు వేల సంఖ్యలో జనం వచ్చి శుభాకాంక్షలు చెబుతున్నారు. ఇదే సమయంలో అనేక రకాల సమస్యలపై వినతిపత్రాలను అందజేస్తున్నారు. బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ తిరుమలరావు, మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి, మేనేజరు బీఎండీ ప్రసాదరావు, ఆర్వో ప్రసాదరావుతో పాటు పలు మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ప్రభుత్వ వైద్యులు, ఇతర సిబ్బంది పెద్దసంఖ్యలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలుసుకుంటున్నారు. ● యూటీఎఫ్, ఏపీటీఎఫ్, ఎస్టీయూ తదితర ఉపాధ్యాయ సంఘాల నాయకులు కె.విజయగౌరి, జోగారావు, సీహెచ్ వెంకటరమణ, రామారావు తదితరులు ఎమ్మెల్యేని కలిసి, విద్యారంగ సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఈ సమస్యలన్నిటినీ నివేదిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ● విద్యుత్ కాంట్రాక్టు కార్మికులంతా బేబీనాయనను కలుసుకొని శుభాకాంక్షలు తెలుపుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యలన్నిటినీ లోకేష్ దృష్టికి తీసుకెళతానని ఆయన హామీ ఇచ్చారు.

- కలుసుకున్న ప్రముఖులు.. గజపతినగరం జనసేన నాయకురాలు, మాజీ మంత్రి పడాల అరుణ, విజయనగరంనకు చెందిన గురాన అయ్యలు తదితరులు చాలా మంది బేబీనాయను కలుసుకున్నారు.

ఇండోర్ స్టేడియం పరిశీలన

బొబ్బిలి పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐకి సమీపంలో నిర్మితమవుతున్న ఇండోర్ స్టేడియంను ఎమ్మెల్యే బేబీనాయన శుక్రవారం పరిశీలించారు. ఈ నిర్మాణ పనుల తాజా స్థితిగతులపై మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మిని, పబ్లిక్‌హెల్త్ ఈఈ దక్షిణామూర్తిని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన ఈ పనులను పూర్తి చేసి క్రీడాకారుల అవసరాల కోసం వినియోగించాలని ఆయన కోరారు.

లలితకుమారిని కలిసిన సుధారాజు



ఎమ్మెల్యే లలితకుమారితో ఇందుకూరి సుధారాజు

శృంగవరపుకోట: శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని శుక్రవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేగా ఎన్నికైనందున అభినందనలు తెలిపారు.

13 ఎకరాల్లో ఉద్యానవన సాగుకు ప్రతిపాదనలు

రేగిడి: మండలంలో 11 పంచాయతీల్లో ఈ ఆర్థిక సంవత్సరంలో 13 ఎకరాల్లో ఉద్యానవన సాగుకు ప్రతిపాదనలు పంపించినట్టు ఏపీవో ఎస్.హరినాథ్ తెలిపారు. నరసనాపల్లి పంచాయతీలో దాదాపు ఎకరా పొలంలో గుర్తించిన ఉద్యానవన సాగు భూమిని ఏపీవోతో పాటు టీఏ రాంబాబు శుక్రవారం పరిశీలించారు. ఈ ఏడాది ఉపాధి భాగస్వామ్యంతో 200 ఎకరాల్లో జీడి, మామిడి, కొబ్బరి మొక్కలు పెంపకానికి లక్ష్యం ఉండగా, ఈమేరకు గ్రామాల్లో రైతులతో చైతన్య సమావేశాలు నిర్వహించి ఈ పంటల ఆవశ్యకత, ప్రయోజనాలపై రైతులకు తెలియజేస్తామని వారు తెలిపారు.

జాబ్ కార్డులు ఎప్పుడు ఇస్తారు?

బలిజిపేట: ఉపాధి హామీ పనులకు వెళ్లేందుకు తమకు జాబ్‌కార్డులు కావాలంటూ నూకలవాడ గ్రామస్థులు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండల ఉపాధి కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు మాట్లాడారు. నూకలవాడ గ్రామం ఉప్పర కులస్థులకు జాబ్ కార్డులు కావాలని అనేక దఫాలుగా ఫీల్డ్ అసిస్టెంట్‌ని అడిగినా పట్టించుకోవడం లేన్నారు. సుమారుగా 50 కుటుంబాలకు ఉపాధి పని కల్పించలేదని ఆరోపించారు. దీనిపై ఉపాధి హామీ ఏపీవో కేశవరావును వివరణ అడగ్గా.. జాబ్ కార్డులు కావాలని తనను ఎవరూ అడగలేదని, తన దృష్టికి ఈ సమస్య ఎప్పుడూ రాలేదని చెప్పారు. రెండు రోజుల్లో జాబ్‌కార్డులు మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నక్క సింహాచలం, నక్క కుమారి, దండుపర్తి తిరుపతిరావు, సంబిల్లు రాము, గౌరమ్మ శ్రీను, పోలురాజు తదితరులు పాల్గొన్నారు.

మస్తర్లలో తేడా వస్తే చర్యలు తప్పవు

మక్కువ: మస్తర్లలో తేడా వస్తే చర్యలు తప్పవని, మేట్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఉపాధి ఏపీవో శంబంగి ఈశ్వరమ్మ అన్నారు. మండలంలోని సరేవలస గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వేతనదారులు పనివేళలు సక్రమంగా పాటించి, కొలతల ఆధారంగా పనులు చేసి గరిష్ఠ వేతనం పొందాలని సూచించారు. జాబ్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నవారికి సత్వరమే కార్డు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించకుంటే సమ్మె చేస్తాం

సాలూరు రూరల్: బకాయి జీతాలు చెల్లించకుంటే సమ్మె చేస్తామని సాలూరు మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఫకీర్‌రాజుకు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కమిటీ ప్రతినిధి శంకరరావు తదితరులు శుక్రవారం సమ్మె నోటీసు ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్‌కు సమస్యలను వివరించడానికి వెళ్తే సరైన స్పందన లేకపోవడం దారుణమన్నారు. తమ బకాయి జీతాలు చెల్లించాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే సమ్మెకు దిగుతామన్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించండి

పార్వతీపురం రూరల్: చిన్న బొండపల్లి గ్రామంలో గత కొన్ని నెలలుగా ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని టీడీపీ మండల అధ్యక్షుడు బోనుదేవి చంద్రమౌళి.. ఏపీ ట్రాన్స్‌కో అధికారులకు కోరారు. ఆయన శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గ్రామంలో విద్యుత్ వినియోగ సామర్థ్యాన్ని బట్టి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు కాలేదని, దీనివల్ల విద్యుత్ వినియోగదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ఎన్నాళ్లు ఎదురు చూసేది?

- ఆరేళ్లుగా ప్రారంభానికి నోచుకోని వసతి గృహం
- సుమారు రూ.2కోట్లు వృథా ● పాడవుతున్న భవనం
- అవస్థలు పడుతున్న బొండపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

బొండపల్లి: గత ఆరేళ్ల కిందట నిర్మించిన వసతిగృహ భవనం ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. చుట్టూ పిచ్చిమొక్కలు, డొంకలు పెరిగి మరమ్మతులకు గురవుతోంది. ఇంకొన్నాళ్లు ఇలాగే ఉంటే పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంటుంది. ఇదీ బొండపల్లి మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు అనుబంధంగా ఉన్న సమీకృత వసతి గృహం పరిస్థితి. గత తెలుగుదేశం ప్రభుత్వ కాలంలో రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ పథకంలో భాగంగా 200 మంది విద్యార్థులకు వసతి కల్పించే విధంగా సుమారు రూ.2కోట్ల వ్యయంతో సమీకృత వసతి భవనాన్ని 2018 సంవత్సరంలో నిర్మించారు. ఈ పాఠశాలలో సుమారు 500 మంది విద్యార్థులు విద్యనభ్యసించేందుకు సమీప గ్రామాల నుంచి వస్తుంటారు. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న విద్యార్థులకు వసతి కల్పించాలనే ఉద్దేశంతో టీడీపీ ప్రభుత్వం వసతి భవనానికి నిధులు మంజూరు చేయించింది. కాంట్రాక్టర్ ముందుకు వచ్చి, భవన నిర్మాణం పూర్తిచేశారు. అయినా నేటికీ ఈ భవనం ప్రారంభం కాలేదు. విద్యకు ప్రాధాన్యత అని చెప్పే వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో ఈ భవనానికి మరమ్మతులు జరిపి ప్రారంభిస్తే బాగుంటుందని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఈ భవనాన్ని ప్రారంభిస్తే బొండపల్లి, కనిమెరక, ముద్దూరు, తమటాడ, చందకపేట తదితర గ్రామాల విద్యార్థులకు మేలు చేకూరుతుంది.



ప్రారంభానికి నోచుకోని వసతి గృహ భవనం

నిధుల కొరతతోనే జాప్యం

మరమ్మతులు చేపట్టి ప్రారంభించాల్సి ఉంది. ప్రస్తుతం నిధుల కొరత ఉండడం వల్ల ఆలస్యమవుతోంది. ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం.

- ఎన్.ప్రేమ్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి

నాగ మాధవికి అభినందనల వెల్లువ

- అధికారులతో కిటకిటలాడిన జనసేన పార్టీ కార్యాలయం



ఎమ్మెల్యే నాగమాధవికి అభినందనలు తెలియజేస్తున్న ఉద్యోగులు

భోగాపురం: నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన లోకం నాగ మాధవిని నియోజకవర్గ, జిల్లా అధికారులు శుక్రవారం ముంజేరు సమీప జనసేన పార్టీ కార్యాలయంలో కలిసి అభినందనలు తెలియజేశారు. విజయవాడ నుంచి గురువారం రాత్రి ఎమ్మెల్యే నాగమాధవి స్వగృహం చేరుకోవడంతో ఆమెను అధికార యంత్రాంగం కలిసి పూలమాలలు, బొకేలతో అభినందనలు తెలియజేశారు. భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ, నెల్లిమర్ల నుంచే కాకుండా జిల్లా నుంచి అనేక మంది శాఖలుగా వచ్చి ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

గుర్ల: మండలంలోని టీడీపీ సీనియర్ నాయకుడు, కెల్ల గ్రామానికి చెందిన సాంబశివరాజును పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామ్‌మల్లికినాయుడు, మండల నాయకులు పరామర్శించారు. ఆయన వారం రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. ఆయన్ని శుక్రవారం పరామర్శించారు. సాంబశివరాజు కుమార్తె విమలారాణి జిల్లాలో టీడీపీ మహిళా విభాగంలో పనిచేస్తున్నారు. పరామర్శించిన వారిలో సన్యాసినాయుడు, కృష్ణ, దాసరి శివప్రసాద్, పి.అప్పలనాయుడు, శ్రీనివాసరావు, కిలారి సూర్యనారాయణ, రామునాయుడు తదితరులు ఉన్నారు.

ఎట్టకేలకు పింఛన్ సొమ్ము అందింది



పింఛనుదారులకు చెక్కులను అందజేస్తున్న దృశ్యం

గుర్ల: వైసీపీ నాయకుల కక్షపూరిత చర్యల వల్ల ఆగిపోయిన వృద్ధాప్య పింఛన్లను టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పిల్లా అప్పలనాయుడు చొరవతో ఎట్టకేలకు పునరుద్ధరించారు. ఎరియర్స్‌తో కలిపి శుక్రవారం అందజేశారు. భూపాలపురం, నడుపూరు, ఆనందపురం (కొత్తపేట) గ్రామాలకు చెందిన టీడీపీ సానుభూతిపరుల పింఛన్లను వైసీపీ నాయకులు కక్షపూరితంగా తీసివేయించారు. ఈ విషయాన్ని టీఎన్ఎస్ఎఫ్ చీపురుపల్లి నియోజకవర్గం అధ్యక్షులు కోరాడ రామకృష్ణ, శీర రమేష్ కలిసి టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, మండల మాజీ అధ్యక్షుడు వెన్నె సన్యాసినాయుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కిరణ్‌కుమార్‌లకు తెలియజేశారు. దీని కోసం మండల ప్రధాన కార్యదర్శి, చింతలపేట, ఆనందపురం, నడుపూరు, భూపాలపురం క్లస్టర్ ఇన్‌చార్జి పిల్లా అప్పలనాయుడు ఆధ్వర్యంలో పోరాటం చేశారు. ప్రభుత్వ ఒత్తిడిని గమనించి పిల్లా అప్పలనాయుడు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో లబ్ధిదారులకు పింఛన్ నిలిపివేసిన నాటి నుంచి నేటి వరకు ఎరియర్స్‌తో కలిపి ఇవ్వాలని హైకోర్టు గురువారం ఆదేశించింది. ఈమేరకు భూపాలపురం గ్రామానికి చెందిన కోరాడ సత్యం, సీర తమ్మినాయుడు, నడుపూరు గ్రామానికి చెందిన చందక అప్పలనాయుడు, చింతపల్లి సత్యం, ఆనందపురంకు చెందిన బెవర సత్యం, దాసరి సత్యం తదితర లబ్ధిదారులకు రూ.లక్షా 11వేల 500ల చొప్పున, ఆనందపురంనకు చెందిన మీసాల సామలప్పుడు, కెంగువ రాములకు రూ.68వేల 750ల చొప్పున పింఛను మొత్తాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ చీపురుపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు కోరాడ రామకృష్ణ, నడుపూరు టీడీపీ నాయకుడు కొట్ల త్రినాథ్, భూపాలపురం గ్రామ యువ నాయకుడు శీర రమేష్, కొత్తపేట నాయకులు సూరపునాయుడు, దాసరి రామ్మూర్తినాయుడు, ఆనందపురం నాయకులు పాల్గొన్నారు.

ఆడ పిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- గరివిడి ఐసీడీఎస్ పీవో ఆరుద్ర



మాట్లాడుతున్న గరివిడి ఐసీడీఎస్ పీవో ఆరుద్ర

గుర్ల: ఆడ పిల్లల విద్య విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవాలని గరివిడి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి అరుద్ర సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ, ఆశావర్కర్లకు, ఏఎన్ఎంలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ ఆడపిల్లల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పౌష్టికాహారం, రక్తహీనత లేకుండా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ మేరకు గుర్ల పీహెచ్‌సీ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు ఏఎన్ఎం, ఆశాలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పిల్లల పెంపకంలో కుటుంబం, సమాజానికి అవగాహన పెంపొందించుట, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. జిల్లా స్థాయిలో యూనిసెఫ్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్, హెల్త్, డీఆర్‌డీఏ, వెలుగు డిపార్ట్‌మెంట్‌లకు శిక్షణ ఇచ్చారు. అలాగే ఈ టీవోటీ ద్వారా ఫ్రంట్‌లైన్ వర్కర్స్ అయిన ఏఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. వారు క్షేత్ర స్థాయిలో తల్లులతో సమావేశాలు ఏర్పాటు చేసి, శిక్షణలోని అంశాలను తెలియజేయాలన్నారు.

పాలవలస ఫీల్డ్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

- తిరిగి విధుల్లోకి చేరిన సత్యనారాయణ

గుర్ల: పాలవలస ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ గేదెల సత్యనారాయణపై సస్పెన్షన్ ఎత్తివేశారు. సత్యనారాయణపై అసత్య ఆరోపణలు మోపి అధికారులు సస్పెండ్ చేశారు. తనపై అధికారులు విధించిన సస్పెన్షన్ అన్యాయం అంటూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణ తర్వాత సస్పెన్షన్ ఎత్తివేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఉపాధిహామీ అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా ఉపాధి హామీ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమా పరమేశ్వరి సస్పెన్షన్ ఎత్తివేసి శుక్రవారం జాయినింగ్ ఆదేశాలు ఇచ్చారు. ఈమేరకు ఉపాధి హామీ జిల్లా పరిపాలన అధికారి బి.సత్యనారాయణ నుంచి సత్యనారాయణ జాయినింగ్ ఆర్డర్ తీసుకుని, విధుల్లో చేరారు.

ఇది అద్భుత విజయం

- నాగార్జునకు లోకేష్ కితాబు



లోకేష్‌తో నాగార్జున

చీపురుపల్లి, విజయనగరం రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో విజయనగరం జిల్లాలో అద్భుత విజయం సాధించారని, ఇది పార్టీ నాయకుల సమష్టి కృషితో సాధ్యమయ్యిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. గురువారం అమరావతిలోని తాడేపల్లిలో తనను కలిసిన నాగార్జునతో ఆయన మాట్లాడారు. ఆమదాలవలస, నరసన్నపేట, పార్వతీపురం, సాలూరు, పార్వతీపురం నియోజకవర్గాల్లో స్టార్ క్యాంపెయినర్‌గా నిర్వహించిన ప్రచారంలో మంచి ఫలితాలొచ్చాయని ఆయన కితాబిచ్చారు. నాగార్జున పనితీరు తనను బాగా ఆకట్టుకుందని లోకేష్ అన్నారు.

అరసాడలో టీడీపీ విజయోత్సవ ర్యాలీ



సంబరాలు చేసుకుంటున్న టీడీపీ శ్రేణులు

వంగర: అరసాడ గ్రామంలో టీడీపీ మహిళా అధ్యక్షురాలు ధనలక్ష్మి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, అభిమానులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ఉమారామలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, కేక్ కట్ చేశారు. ఎర్రన్నాయుడు విగ్రహానికి పాలభిషేకం చేశారు. టీడీపీ నాయకులు కృష్ణమూర్తి, రాజగోపాలనాయుడు, నవీన్, మజ్జి వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు నిలుపుదల

భోగాపురం: ఎ.రాయవలస విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు శుక్రవారం తెలిపారు. ఎయిర్‌పోర్టు ప్రాంతంలో విద్యుత్తు లైన్లు ఏర్పాటు పనుల్లో భాగంగా విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. ఎ.రాయవలస, గూడెపువలస, దల్లిపేట, రెడ్డికంచేరు, బైరెడ్డిపాలెం, ముగడపేట, చాకివలస, ఎయిర్‌పోర్టు ప్రాంతాల్లో విద్యుత్తు ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

తెట్టంగి సొసైటీ అధ్యక్షుడు రవిబాబు రాజీనామా

గుర్ల: తెట్టంగి సహకార సొసైటీ అధ్యక్షుడిగా ఉన్న రవిబాబు శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని జిల్లా అధికారులకు అందజేశారు. తాను రాజకీయాలకు, సొసైటీ పదవికి దూరంగా ఉంటానని ఆయన స్పష్టం చేశారు.

కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయం
మహారాజ్ అలక్ నారాయణ్ సొసైటీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ (మాన్సాస్) కోట - విజయనగరం
దేవాదాయ ధర్మాదాయశాఖ (కోట), విజయనగరం

ఆర్.సి.నెం. 184/2024, సీల్డ్ టెండర్-కం-బహిరంగ వేలం ప్రకటన తేది:07.06.2024

మాన్సాస్ ట్రస్టు, విజయనగరం వారికి చెంది యుండి వారి హక్కు భుక్తములోని విజయనగరం జిల్లా మరియు పట్టణం, టౌన్ సర్వేనెం.690/1బి పార్టు నందు ఎ.3.00సెం. విస్తీర్ణం గల ఖాళీ స్థలమును రోజు ఒక్కింటికి చెల్లించు పద్ధతిపై లైసెన్సు కాలం తే.01.08.2024దీ 60రోజులకు తక్కువ కాకుండా ఎగ్జిబిషన్ నిర్వహణ నిమిత్తం తే.26.06.2024దీ ఉదయం గం.11.00లకు మాన్సాస్ ట్రస్టు ఉప కమీషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి వారు, విజయనగరం జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షములో మాన్సాస్ కార్యాలయము వద్ద టెండర్-కం-బహిరంగ వేలం నిర్వహించబడును. ఇందు పాల్గొనుటకు గుర్తింపు నిమిత్తం ఆధార్ కార్డు కాపీతో పాటు ప్రథమ దరావత్తుగా రూ.1,00,000/-ల డిమాండు డ్రాఫ్ట్ ఈ.ఓ మాన్సాస్ ట్రస్టు, విజయనగరం వారి పేర సమర్పించవలెను. తదితర వివరములను కార్యాలయము పనిచేయు వేళలలో అడిగి తెలుసుకొనవలెను.

గౌ॥శ్రీ పూసపాటి అశోక్ గజపతిరాజు గారు, ఛైర్మన్-మాన్సాస్ ట్రస్టు
సం/- ఉప కమీషనర్ మరియు కార్యనిర్వహణాధికారి, మాన్సాస్ ట్రస్టు, విజయనగరం

HIMAGIRI CINEMAS
(2 SCREENS)
Experience it in 4K 7.1 Dolby
1st Recliner Seating in VIZIANAGARAM
BOOK ONLINE TICKETS Paytm
NOW SHOWING



SCREEN 1 MANAME	SCREEN 2 BAJE VAAYU VEGAM
11-00 AM	11-00 AM
02-30 PM	02-30 PM
06-30 PM	06-30 PM
09-45 PM	09-45 PM

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, విజయనగరం : 9985411533
పార్వతీపురం : 9985403035, సాలూరు : 9492900300

కొత్త జంట కోరుకునే పెళ్లి కానుక
వివాహ మహోత్సవ శుభాకాంక్షలు
ఆంధ్రజ్యోతి లో
వివాహ ప్రకటన ఇవ్వటం ద్వారా మీ ప్రతిష్ఠను పెంచుకోండి.
నవీన రీతిలో ఆహ్వానించి బంధుమిత్రులను అలరించండి
➤ శుభాకాంక్షలు
➤ ధన్యవాదాలు
➤ వివాహ ఆహ్వానాలు
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% ఆదనం
ప్రకటనలకు సంప్రదించండి
99854 11066